J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 25 25.11.2022, శుక్రవారం వెల : రూ. 5 /-
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి
సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి





## రానున్న ఎన్నికల్లో

# స్టార్‌వార్

### ఓవైపు పొలిటికల్ స్టార్
### మరోవైపు సినిమా స్టార్స్

**జగన్ ప్రభుత్వంపై ఆగ్రహంతో అగ్రహీరోలు**

**అల్లు స్టూడియోస్ వేదికగా వ్యూహరచన...?**

**వైసిపి ఓటమే లక్ష్యంగా అడుగులు**

**విపక్షాల డైరెక్షన్లో తారల యాక్షన్**

రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో రంగుల ప్రపంచం కీలక భూమిక పోషించనుందా...? 'పొలిటికల్ స్టార్' ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలుగు సినిమా హీరోలు కొందరు వ్యతిరేకం కాబోతున్నారా..?? జగన్ ఓటమే లక్ష్యంగా ఈ అగ్రతారలు ఒక్క తాటిపైకి రానున్నారా...??? ఈ ప్రశ్నలన్నిటికీ రాజకీయ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానాలు వినపడుతున్నాయి. తాడేపల్లిలో జరిగిన 'అవమానానికి' బదులు చెప్పడానికి అవకాశం కోసం వీరంతా ఎదురు చుస్తున్నారని సినీవర్గాలు అంటున్నాయి. హైదరాబాదులోని అల్లు స్టూడియోస్ వేదికగా ఈ దిశగా చాపక్రింద నీరులా వ్యూహరచన సాగుతోందని అంటున్నారు. రాష్ట్రానికి చెందిన కొందరు రాజకీయ నేతలతో పాటు, అత్యున్నతస్థాయిలో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులు, సినీ రంగ ముఖ్యులు వారంలో ఒకసారి ఎవరో ఒక ప్రముఖుడి ఇంట్లో విందు పేరుతో సమావేశమై భవిష్యత్ ఆంధ్రా ఎన్నికల గురించే ప్రధాన అజెండాగా గంటల కొద్దీ చర్చించుకుంటున్నారని హైదరాబాదు సెలబ్రిటీల ద్వారా తెలుస్తోంది.

10లో





# పేదవర్గాల కోసమే.. న్యాయసేవాధికార సంస్థ



సమాజంలో పేద, బడుగు బలహీనవర్గాల వారికి న్యాయం అందించేందుకే న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భవించిందని, ఎవరికైనా న్యాయపరమైన సమస్యలుంటే జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించి ఉచిత న్యాయం పొందవచ్చని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ తెలిపారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైకోర్టు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు నెల్లూరులోని కొండాయపాళెం వద్దనున్న జనహిత-వాత్సల్య శరణాలయంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1987వ సంవత్సరంలో ప్రభుత్వం జాతీయ న్యాయసేవాధికార సంస్థ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టం ద్వారా పేదవర్గాలకు, మహిళలకు ఉచిత న్యాయం అందుతున్నదన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, బాలల హక్కులు తదితర అంశాలపై ఆయన బాలలకు అవగాహన కలిగించారు. అనంతరం బాలలకు, వృద్ధులకు తినుబండారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు, పారా లీగల్ వలంటీర్లు వేణుగోపాల్, పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు చేయూతనందించే.. 'భవిత'

## - మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఉపయోగంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాలలోని ప్రత్యేక అవసరాలు గల 394మంది పిల్లలకు 19.07లక్షల రూపాయల విలువైన 6 రకాల ఉపకరణాలను మంత్రి చేతులమీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చిన్న చిన్న లోపాలతో పుట్టిన పిల్లలకు అందరూ చేయూత నివ్వాలని, వారు కూడా సమాజంలో సాధారణ వ్యక్తుల్లా జీవనం సాగించేందుకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకించి చదువుకున్న వయసులో వీరికి అండగా నిలిస్తే భవిష్యత్‌లో సాధారణ వ్యక్తులతో పోటీపడి వారికంటే మిన్నగా సమాజంలో జీవనం సాగించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వైద్య శిబిరాలు, శస్త్ర చికిత్సలతో పాటు ఉచితంగా ఉపకరణాలను అందిస్తున్నామన్నారు. వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, రోలేటర్, సి.పి. చైర్స్, వినికిడి సహాయ పరికరాలు, ఊతకర్రలు మొత్తం 6 విభాగాలకు సంబంధించి ఉపకరణాలను అందించడం సంతోషకరమన్నారు. ప్రస్తుత సమాజంలో దివ్యాంగులకు, దివ్యాంగులం అనే భావన వారిలో రాకుండా, అందరితో సమానంగా వారిని చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. గ్రామ, మండల స్థాయిలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి వారి భవిష్యత్‌కు అందరూ తోడ్పాటు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జడ్పీ సీఈఓ చిరంజీవి, విద్యాశాఖ అధికారులతో పాటు వైకాపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


## ఇందిరమ్మ సేవలు

# చిరస్మరణీయం

## - డిసిసి అధ్యక్షులు చేవూరు



భారత మాజీప్రధాని, దివంగత ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆమె సేవలు దేశప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 19న ఇందిరాగాంధీ 105వ జయంతి సందర్భంగా నెల్లూరులోని ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న ఇందిరమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఇందిరాగాంధీ ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. సివి శేషారెడ్డి, ఉడతా వెంకట్రావు, సురేష్‌బాబు, ఏటూరి శ్రీనివాసరెడ్డి, బాలసుధాకర్, ఫయాజ్, గణేష్‌బాబు, అల్లాఉద్దీన్, హుస్సేన్‌బాషా, పవన్‌కుమార్, కిషోర్, రాజేష్‌రెడ్డి, మహబూబ్‌బాషా, బ్రహ్మయ్య, ఫైజుల్లా పాల్గొన్నారు.



# మరో రాకెట్.. రెడీ

## పిఎస్ఎల్వి-సి54 ఈ నెల 26న ప్రయోగం
## ఓషన్‌శాట్‌తో పాటు నింగిలోకి మరో 8 ఉపగ్రహాలు

***శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి మరో రాకెట్ నింగిలోకి దూసుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. అంతరిక్షరంగంలో తనకంటూ ప్రత్యేక ప్రతిభాపాటవాలతో రాణిస్తూ, అగ్రరాజ్యాలకు ధీటుగా విజయవంతంగా రాకెట్ ప్రయోగాలు చేస్తోన్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈనెల 26న పిఎస్ఎల్వి-సి 54 రాకెట్ ప్రయోగానికి అన్ని సన్నాహాలు పూర్తిచేసింది. ఇస్రో నమ్మకాన్ని వమ్ముచేయని రామబాణంగా పేరు పొందిన పిఎస్ఎల్వి సీరీస్‌లో ఇది మరో అస్త్రం కావడం విశేషం. ఓషన్ శాట్‌తో పాటు, మరో 8 ఉపగ్రహాలను కూడా ఈ ప్రయోగం ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నారు.***

శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ఈనెల 26వ తేది, శనివారం ఉదయం 11.56 గంటలకు పిఎస్ఎల్వి-సి54 రాకెట్ ప్రయోగానికి షార్ శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాకెట్ అనుసంధాన ప్రక్రియ కూడా పూర్తయింది. ఈనెల 23న ట్రయల్ రిహార్సల్స్ కూడా విజయవంతంగా చేశారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. వాతావరణం అనుకూలిస్తే అనుకున్న సమయానికి రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు. నాలుగుదశల్లో ఈ రాకెట్ నింగిలోకి దూసుకువెళ్తుంది. శిఖరభాగంలో మనదేశానికి చెందిన 'ఓషన్ శాట్' ఉపగ్రహం ఉంటుంది. నిర్ణీత కక్ష్యలో దానిని ప్రవేశపెడతారు. దాంతో పాటు మరో 8 ఉపగ్రహాలను కూడా అంతరిక్షంలోకి పంపనున్నారు.

### సముద్ర పరిశీలన లక్ష్యంగా..'ఓషన్ శాట్' :

మనదేశానికి చెందిన 960కిలోల ఓషన్‌శాట్(ఇఓఎస్-06) భూ పరిశీలన ఉపగ్రహం. సముద్ర ఉపరితల పరిశీలనకు ఎంతో ఉపకరిస్తుంది. అయిదు సంవత్సరాల పాటు సేవలందించే విధంగా ఓషన్ శాట్‌ను మన శాస్త్రవేత్తలు రూపొందించారు. అదేవిధంగా ఈ ప్రయోగంలో భారత్-భూటాన్‌లు సంయుక్తంగా తయారుచేసిన భూటాన్ శాట్‌ను, దాంతో పాటు పిక్సెల్ సంస్థ రూపొందించిన ఆనంద్ శాట్, ధృవ స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందిన రెండు థైబోల్ట్ శాట్‌లను, అమెరికాలోని స్పేస్‌ఫ్లైట్ సంస్థకు చెందిన నాలుగు ఆస్ట్రోకాస్ట్ ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్‌ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని సన్నాహాలు పూర్తిచేశారు.

# 'ఆకాశవాణి'కి..'వ్యాఖ్యాత' కావలెను

నెల్లూరు ఆకాశవాణి (ఆలిండియా రేడియో) కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో వ్యాఖ్యాతగా పనిచేయడానికి స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ పొంది, 50 ఏళ్ల వయసుకు మించనివారు అందుకు అర్హులని, తెలుగులో మాట్లాడడం, రాయగలగడం, స్పష్టమైన ఉచ్ఛారణ, ప్రసారాలకు అనువైన కంఠస్వరం ఉండాలని, నెల్లూరు నగరంలో నివసిస్తున్న స్థానికులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్ష, స్వర పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తుల కోసం నగరంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న ఆకాశవాణి కార్యాలయంలో సంప్రదించాలని, దరఖాస్తులను డిసెంబరు 7వ తేది లోపు పంపాలని ఆయన కోరారు.

## కాలధర్మం

# బోగొల్లు పిచ్చమ్మ



పాటూరు వాస్తవ్యురాలు, నెల్లూరు నివాసి కీర్తిశేషులు బోగొల్లు నారాయణరెడ్డి సతీమణి బోగొల్లు పిచ్చమ్మ తమ 95వ ఏట నవంబర్ 24 గురువారం ఉదయం, నెల్లూరులోని తన రెండవ కుమారుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా ఆమె అస్వస్థతతో ఉన్నారు. నారాయణరెడ్డి - పిచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. తమది వ్యవసాయ కుటుంబమైనప్పటికీ తన బిడ్డలందరినీ పెద్ద చదువులు చదివించాలని తపనపడేవారు పిచ్చమ్మ. తాను అనుకున్నట్లుగానే ముగ్గురు కుమారులను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దారు.

పెద్దకుమారుడు వేణుగోపాలరెడ్డి చాలకాలం క్రితమే అనారోగ్యంతో పరమపదించారు. రెండవ కుమారుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి ప్రపంచ ప్రఖ్యాత ఆరోగ్య సంస్థ డేమియాన్ ఫౌండేషన్ ముఖ్య సమన్వయకర్తగా సేవలందించారు. మూడవ కుమారుడు మోహన్‌రెడ్డి సుప్రసిద్ధ ఆర్కిటెక్ట్‌గా, బిల్డర్‌గా అందరికీ సుపరిచితులే. తమ మోహన్ అసోసియేట్స్ ద్వారా ఎన్నో ప్రఖ్యాత సంస్థలకు భవన నిర్మాణ రూపకర్త బాధ్యతలను మోహన్‌రెడ్డి నిర్వహించారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు వంటి మహానగరాలలో పర్ఫెక్ట్ ఆర్కిటెక్ట్ కమ్ బిల్డర్‌గా మోహన్‌రెడ్డికి విశేషగుర్తింపు ఉంది. శుక్రవారం ఉదయం నెల్లూరులో ఆమె అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

మాతృమూర్తిని కోల్పోయిన బోగొల్లు సోదరులకు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ... పిచ్చమ్మ ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

## • వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

# జిల్లా సైన్యాధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తల నియామకం







## • విపిఆర్ కొనసాగింపు • బీద, నేదురుమల్లిలకు కొత్తగా అవకాశం

పార్టీ పునర్వ్యవస్తీకరణకు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాలకు కొత్త సైన్యాధ్యక్షులని ప్రకటించారు. పనిలో పనిగా స్వల్పమార్పులతో ప్రాంతీయ సమన్వయకర్తలను కూడా నియమించారు. అందులో భాగంగా 26 జిల్లాల అధ్యక్షులను, ప్రాంతీయ సమన్వయకర్తలను ప్రకటించారు. చాలామందిని పాత పదవులలోనే కొనసాగించగా కొంత మంది కొత్త వారికి పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు. నెల్లూరుజిల్లాకు సంబంధించి నంతవరకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డినే మళ్ళీ జిల్లా అధ్యక్షులుగా కొనసాగించారు. ఆయనతో పాటు రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నెల్లూరుతో పాటు తిరుపతి, కడప బాధ్యతలను గతంలోలాగే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికే అప్పజెప్పారు. నెల్లూరుజిల్లాకి చెందిన మరో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావును కొత్తగా పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల సమన్వయకర్తగా నియమించారు. ఇప్పటికే ఆ ప్రాంతాల సమన్వయకర్తగా ఉన్న భూమన కరుణాకరరెడ్డితో కలిసి మస్తాన్‌రావు ప్రాంతీయ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కొత్తగా నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పార్టీ అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్తగా, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డికి సహాయకుడిగా చెవిరెడ్డి కొనసాగుతారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న చెవిరెడ్డి స్థానంలో ఆ బాధ్యతలు రామ్‌కుమార్‌రెడ్డికి అప్పజెప్పారు. గతంలో పలు సందర్భాలలో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేసిన అనుభవం కూడా రామ్‌కుమార్‌రెడ్డికి ఉంది. ఆయన ప్రాతినిధ్యం వహించే వెంకటగిరి నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి రావడంతో రామ్‌కి ఈ అవకాశం దక్కింది. గతంలో ఆయన తండ్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జాతీయ కాంగ్రెస్‌పార్టీలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఇప్పుడు ఆయన తనయుడు రామ్‌కుమార్‌రెడ్డికి ప్రాంతీయపార్టీ అయిన వైసిపికి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం లభించింది.

## ఏఎస్పీ చౌడేశ్వరికి..
# ఎస్పీగా ప్రమోషన్



జిల్లాలో ఏఎస్పీ (క్రైమ్స్)గా పనిచేస్తున్న కె. చౌడేశ్వరికి నాన్ క్యాడర్ ఎస్పీగా ప్రమోషన్ లభించింది. రాష్ట్రంలోని 20 మంది ఏఎస్పీలకు నాన్‌క్యాడర్ ఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న ఉత్తర్వులిచ్చింది. అందులో భాగంగా చౌడేశ్వరిని గుంతకల్ జిఆర్‌పి (రైల్వే) ఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత మే6న ఆమె జిల్లాలో ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# 'నవరత్నాల'తో వేలాదిమంది పేదలకు లబ్ధి

## మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టి అమలుచేస్తున్న 'నవరత్నాలు' పథకాలతో వేలాదిమంది పేదప్రజలకు లబ్ధి చేకూరుతోందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఈ పథకాలను అందజేస్తోందని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన కలువాయి మండలంలోని కుల్లూరు గ్రామంలో కోటీ 68 లక్షల వ్యయంతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత, కుల్లూరులో 35 లక్షల ఖర్చుతో నిర్మాణం చేసిన నూతన సచివాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కోటీ 18 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనానికి, 21.80 లక్షల వ్యయంతో కట్టిన రైతు భరోసా కేంద్రానికి, 17.55 లక్షలతో నిర్మాణం జరిగిన బల్క్ మిల్క్ సెంటర్ భవనానికి ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాడు-నేడు' పథకం కింద కుల్లూరులో జడ్పీ హైస్కూల్‌కు 63 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు, కళాశాలల అభివృద్ధికి, పలు ప్రభుత్వ వైద్యశాలల భవనాల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

# కేంద్ర నిధులను.. రాష్ట్రం పక్కదారి పట్టిస్తోంది

## ----- బీజేపీ నేత సూర్యనారాయణరాజు విమర్శ -----




రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు విమర్శించారు. ఈనెల 23న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్నారు. నెల్లూరు జిల్లాలో రైతుల నుంచి గత సీజన్‌లో కొనుగోలుచేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను రైతులకు ఇంకా ఇవ్వనేలేదని, దీంతో రైతుకుటుంబాల పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లాశాఖ అధ్యక్షులు భరత్‌కుమార్‌యాదవ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, యరబోలు రాజేష్, దాసరి రాజేంద్ర, గిరికుమార్ పాల్గొన్నారు.

లాయర్
నవంబర్ 25, 2022

# మహిళలపై మారణకాండలకు.. అంతం ఎప్పుడు?

అత్యాచారం, అఘాయిత్యం, అనుమానాలు, లైంగిక దాడులు, హత్యలు, 'పరువు హత్యలు' ఆత్మహత్యలు, 'గృహహింస'లు.. పేరేదైతేనేం ఎంతో కాలంగా ఇవన్నీ మహిళల ప్రాణాలు తోడేస్తూనే ఉన్నాయి. రకరకాల కారణాలు, ఎన్నో రకాల హింసలు.. ఒకటా రెండా ఎన్నని చెప్పగలం?.. ప్రేమించిన అమ్మాయినే కత్తులతో ముక్కలు ముక్కలుగా నరికి చంపి శవాన్ని మూటగట్టి రోడ్లపై పారేసే పైశాచిక వ్యక్తులు, కూతురు ఎవరినో ప్రేమించిందనే కోపంతో తల నరికేసే పాపిష్టి తండ్రులున్న ఈ లోకంలో మహిళల బతుకే ఒక ప్రశ్నార్థకంగా మారిపోతోంది. ప్రతిక్షణం జీవన్మరణ సమస్యే! ఎంతగా అణగిమణిగి పడివున్నా ఏదో ఒక సాకుతో మహిళలకు వేధింపులే. ఇంటా బయటా అన్నీ అవమానాలే.. అంతా అనుమానాలే. ఈ భూప్రపంచంలో మహిళలకు ఎక్కడా సవ్యంగా బతికే పరిస్థితి కనిపించడం లేదు. మగాళ్ళు మృగాళ్ళుగా చెలరేగిపోతున్న నేటి ప్రపంచంలో, సాటి మనుషులనే మానవత్వం కూడా లేకుండా, మనకోసం..మన కుటుంబాన్ని ఉద్ధరించేదానికోసం జీవితాలనే ధారపోస్తున్న స్త్రీమూర్తుల పట్ల ఇంత ఘోరంగా...ఇంత కాఠిన్యంతో వ్యవహరించడం న్యాయమేనా?..ఇది మనుషులు చేయాల్సిన పనులేనా?..ఇదేనా మన మానవత?.. అంటూ సభ్యసమాజం తల్లడిల్లుతోంది. ప్రేమ పేరుతో వంచనలు, పెళ్లి దాకా వస్తే కట్నం వేధింపులు. గొంతు పిసికి చంపడాలు, ఫ్యాన్లకు ఉరెయ్యడాలు, అనుమానాలతో చావగొట్టడాలు.. అనునిత్యం మహిళలకు రోదనలు వేదనలే! ఇది ఏ ఒక్క ప్రాంతంలోనో కాదు..ఏ ఒక్క దేశంలోనో కాదు...ప్రపంచమంతా ఇదే దుస్థితి. భూమాత ముద్దుబిడ్డలైన మహిళామతల్లులకు భద్రత అన్నదే లేకుండా పోయింది. ఎప్పుడు ఏ మానవమృగం కోరలు చాస్తుందోనని ..కంటినిండా నిద్రకూడా కరువైపోతోంది. ప్రతిరోజూ ఎంతోమంది ఇలా నానారకాల అకృత్యాలకు బలయిపోతూనే ఉన్నారు. ఎక్కడ చూసినా కామపిశాచాలే. ఇళ్ళల్లో..స్కూళ్ళల్లో.. కాలేజీల్లో.. కార్యాలయాల్లో.. రోడ్లల్లో ఇలా అంతటా లైంగిక వేధింపులే. లొంగకపోతే గొంతుకోసేయడమే!.. ప్రేమ పేరుతో కామాంధుల మోసాలు లెక్కలేనన్ని. మహిళలు ఎవరికి చెప్పుకోగలరు?..ఏమని చెప్పుకోగలరు?...ఎన్నని చెప్పుకోగలరు?.. ప్రతి పురుషుడూ.. ఒక స్త్రీ కన్నబిడ్డే కదా!.. విచక్షణ నశించిందా?.. కష్టసుఖాలను పంచుకోవాల్సిన భర్తే.. శాడిస్టుగా మారి.. కాలయముడై కడతేరుస్తున్న దారుణాలు, ఆడపిల్ల పుడితేనే చీదరించుకుంటూ కుటుంబసభ్యులే పెడుతున్న బాధలు! ఆస్తుల కోసం చంపేవారు కొందరైతే, తాగుడుకు పుస్తెలివ్వలేదని చంపేవాళ్ళు కొందరు. అసలు మహిళా లోకానికి భద్రత ఎక్కడుంది?.. ఈ భూప్రపంచంలో ఎక్కడ చూసినా మహిళలపై దారుణ మారణకాండలు జరుగుతూనే ఉన్నాయి. అవి నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పదకొండు నిమిషాలకు ఒక మహిళ, లేదా బాలిక తమ భర్త చేతిలోనో, లేదా తమ సొంత కుటుంబ సభ్యుల చేతిలోనో దారుణహత్యలకు గురవుతున్నారంటూ తాజాగా ఈనెల 22న ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందంటే ప్రపంచంలో మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చూడండి. బయట పిశాచాలు, ఇంట్లో రాకాసులు అన్నట్లుగా తయారైంది మహిళల స్థితి. ఇళ్లలో.. భర్తతో పాటు అందరూ అయినవాళ్లే అయినా.. నాలుగ్గోడల మధ్య మహిళలు ఎంతగా నరకం అనుభవిస్తున్నారో దీనిద్వారా మరింతగా స్పష్టమవుతోంది. ఈ అమానుషాలు సభ్య సమాజానికే సిగ్గుచేటు. ఈ తీరుమారాలి. ఈ దారుణాలు అంతం కావాలి. మహిళలపై పెరుగుతున్న హింసను అంతం చేయడానికి ప్రపంచదేశాలన్నీ ఎక్కడికక్కడ చిత్తశుద్ధితో కృషిచేయాలని ఐరాస సూచిస్తోంది. ఇది అందరికీ శిరోధార్యం. ఇకనైనా మనిషి.. పశుతత్వాన్ని వీడి.. మనిషిగా మారాలి. సృష్టికి మూలకారకులై, లోకానికి వెన్నెల వెలుగులై, కుటుంబానికి.. సమాజానికి అన్నివిధాలా అండదండలందిస్తున్న మహిళాలోకాన్ని మనిషన్న ప్రతిఒక్కడూ గౌరవించాలి. మహిళలను అంతం చేస్తున్న రాక్షసభర్తల పట్ల, మహిళలపై అఘాయిత్యాలకు దిగుతున్న వారిపట్ల కఠినచర్యలకు అన్ని దేశాల ప్రభుత్వాలు మరింతగా సంసిద్ధం కావాలి. భూమాతే లేకుంటే జీవరాశులకు మనుగడే ఉండదు.. స్త్రీమూర్తే లేకుంటే మానవుడికి మనుగడే ఉండదు. మహిళలను అందరూ మాతృసమానులుగా భావించి ఆత్మీయతతో వారిని ఆదరించాలి. అన్నిటికన్నా ముఖ్యంగా వారు ఎలాంటి హింసలకు గురికాకుండా చూడాలి. అతి ముఖ్యం... వారి భద్రతకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలి.

# పాఠశాలల్లో పాకుతున్న విషసంస్కృతి



మన చుట్టూ ఉన్న సమాజం మునుపటిలా లేదు. బాగా కలుషితమైపోయింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పేరుతో 'టచ్ ఫోన్ల'లో కుప్పలుగా వచ్చిపడుతున్న అశ్లీలం, సమాజాన్ని బూతుబుంగగా మార్చేస్తోంది. అసభ్యకరమైన ఆ పాశ్చాత్య విషసంస్కృతి అందరినీ నాశనం చేస్తోంది. కరోనా వచ్చి పీక పిసికినా మనిషికి బుద్ధి రావడం లేదు. మళ్ళీ విచ్చలవిడితనం పెరిగిపోతోంది. ఎక్కడ బట్టినా అరాచకాలే. చివరికి చిన్నపిల్లలకు చదువులు చెప్పే పాఠశాలల్లోనూ ఈ విషం పాకిపోతోంది. దీంతో చిన్నారులకు, విద్యార్థినులకు అసలు భద్రతే ఉండడం లేదు. ఎక్కడబట్టినా అశ్లీల వాతావరణమే. సమాజంలో ఎలా నడుచుకోవాలో పాఠాలు చెప్పే పాఠశాలలు గతంలో దేవాలయాల్లా ఎంతో పవిత్రంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి పోయింది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొన్ని పాఠశాలలు పిల్లలకు బూతుపాలు పట్టిస్తున్నాయంటే ఏమనుకోవాలి?.. నైతిక ప్రవర్తన అన్నది కలికానికి కూడా కానరావడం లేదు. కొన్ని పాఠశాలల్లో అభం శుభం తెలియని చిన్నారులను సైతం లైంగిక వేధింపులకు గురిచేసే పరమ దౌర్భాగ్యమైన పరిస్థితి. మన జిల్లాలో కూడా అలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉండడం సిగ్గుచేటు!.. మొన్నటికి మొన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో నాలుగో తరగతి చిన్నారిపై జరిగిన అకృత్యం మొత్తం పాఠశాల విద్యావ్యవస్థకే మచ్చ తెచ్చింది. ఓ 'పీఆర్‌ఓ' ఓ చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడడం ఎంత దారుణం?.. జిల్లావ్యాప్తంగా ఇది సంచలనం కలిగిస్తోంది. అసలు ప్రైవేట్ పాఠశాలల్లో పిఆర్‌ఓల వ్యవస్థ అవసరం ఏమొచ్చింది?..వీటికి అనుమతి ఉందా?.. వీటి వెనుక ఏం జరుగుతోంది?..అనే సందేహాలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. సిబ్బందికి, పాఠశాల చిన్నారులకు సంబంధం లేకపోయినా, ఓ పిఆర్‌ఓ బాలిక పట్ల అలా ప్రవర్తించే అవకాశం ఎలా వచ్చింది? దీనికి బాధ్యులెవరు? ఈ అకృత్యాలకు అడ్డుకట్ట వేసేవారే లేరా?..అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ప్రైవేట్ స్కూళ్ళలో.. నిర్వాహకులదే ఇష్టారాజ్యం :

చాలాకాలంగా జిల్లాలోని కొన్ని ప్రైవేట్‌స్కూళ్ళల్లో నిర్వాహకులదే ఇష్టారాజ్యమైపోయింది. అడిగేవారు లేకపోవడంతో ప్రభుత్వ నిబంధనలను ఎప్పుడో తుంగలో తొక్కేశారు. ఫీజులు వేలల్లో గుంజుతారు.. కానీ వసతులు మాత్రం ఉండవు. నిబంధనల మేరకు ఏ పాఠశాలలో అన్ని వసతులు ఉంటున్నాయి?.. పరిశీలించేదెవరు?.. ఎన్ని స్కూళ్ళలో అవసరమైన ల్యాబ్‌లు, లైబ్రరీలు, క్రీడా మైదానాలు తదితర సదుపాయాలున్నాయా?.. ఎవరడుగుతున్నారు?..ఏ యాక్సిడెంటో జరిగితే తప్ప ఆ పాఠశాలల వాహనాలు సరిగా ఉన్నాయో లేదో చూడరు. డ్రైవర్లు ఎంత

## సమస్యల తో 'రణం'

నిర్లక్ష్యంగా ఉంటున్నారో పట్టించుకోరు?..ఏ అఘాయిత్యమో జరిగితే తప్ప ఆ స్కూళ్ళ జోలికెవరూ పోరు. ఒకవేళ ఎవరైనా తనిఖీలకు వచ్చినా వాళ్ళను సులువుగా బుట్టలో వేసేసుకుని, వాళ్లకి కావాల్సింది చేసేసి, తాము ఆడిందే ఆట అన్నట్లుగా తయారైపోతుంటారు. ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో, కొంతమంది గురువులు కూడా బాలికల పట్ల, విద్యార్థినుల పట్ల అనైతికంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఎంతోకాలంగా జిల్లాలోనూ ఈ ఘోరాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే, అట్లని మొత్తంగా అన్ని పాఠశాలలనూ ఒకే గాటన కట్టలేం. ఎంతోమంది మహానుభావులు, దేవుళ్ల లాంటి గురువులు పాఠశాలలను క్రమశిక్షణతో నడుపుతూ పిల్లలను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. వాళ్ళకి శతకోటి వందనాలు. ఇంకా అలాంటివాళ్ళు ఉండబట్టే సమాజం..ఈ మాత్రమైనా నిజాయితీగా ఉంది. కానీ కొంతమంది ప్రైవేట్‌వ్యక్తులకు పాఠశాలలే వ్యాపారకేంద్రాలు. వారికి డబ్బే ప్రధానం. ఆ ప్రాంగణాలకు వారే రాజులు. 'భలే క్రమశిక్షణ'గా ఉన్నట్లు నీతులు. లోపలంతా బూతులు!..ఇవన్నీ అందరికీ తెలిసిన బహిరంగ రహస్యాలే!.. దొరికితేనే దొంగలు!.. లేకుంటే వారే వాహినీవారి పెద్దమనుషులు. వేలకు వేలు డబ్బు కట్టి, తమ పిల్లలను చేర్చే తల్లితండ్రులను కూడా స్కూళ్లలోకి అడుగుపెట్టనివ్వరు. బయటే ఉండాలి. బయటనుంచే వెళ్లిపోవాలి. లోపలకి రానివ్వరు. లోపల ఏం జరుగుతుందో చూడనివ్వరు. అంతా వారిదే రాజ్యం. అందువల్ల వాటిలో ఏ తప్పు జరిగినా.. వారే కదా బాధ్యులు?.. ఇప్పటికైనా తల్లితండ్రులు జాగ్రత్తగా మసలుకోవాలి. తమ పిల్లలకు పాఠశాలల్లో ఏం చెప్తున్నారో, ఎవరేం చేస్తున్నారో ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండాలి. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో తల్లితండ్రులదే ప్రధాన బాధ్యత అని గుర్తించాలి. స్మార్ట్ ఫోన్లు వచ్చాక మంచి కంటే, చెడుపైనే ఆకర్షణ ఎక్కువగా ఉంటోంది. ఫోన్ల మాయాజాలంలో పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్కూళ్ళు-కాలేజీల్లో కూడా ఇప్పుడు అందరిచేతుల్లోనూ అవే. ఎవరి ఫోన్ల లోంచి ఎంతెంత అశ్లీలం పిల్లల మెదళ్లలోకి చేరుతోందో తప్పనిసరిగా నిఘాపెట్టాలి. ఈ ప్రైవేట్ విద్యావ్యాపారం పట్ల ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేయాలి. ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణకు పోలీసులతో కూడిన నిపుణుల బృందాలను నియమించాలి. పాఠశాలల్లో ఏ సమయంలోనైనా సరే తనిఖీ చేసేందుకు నిఘా బృందాలకు, తల్లితండ్రుల కమిటీలకు అనుమతివ్వాలి. పర్యవేక్షణకు అధికారులకు వస్తున్న విషయం కూడా ముందుగానే ఫోన్ల ద్వారా తెలిసిపోతుంటుంది. అందువల్ల అసలు పాఠశాలల్లోకి నిర్వాహకులతో సహా ఎవరి ఫోన్లనైనా సరే..అనుమతించకుంటే ఇంకా మంచిది. ప్రభుత్వం వీటిపై దృష్టిపెట్టాలి. చిన్నారులపై అలాంటి అఘాయిత్యాలు మళ్ళీ ఎక్కడా జరగకుండా చూడాలి!....

\- సంచారి

# పచ్చ చొక్కా వేసుకుంటే తప్పా..?

ఇటీవల ఆంధ్రా రాజకీయాలలో కొన్ని పార్టీల సానుకూలపరుల వెర్రి ముదిరి, పిచ్చి పరాకాష్టకు చేరుతుందా అనిపిస్తోంది. ఒక్కొక్క సందర్భంలో అధికారుల ప్రవర్తన కూడా వింతగా కనిపిస్తోంది. ఇటీవల నేను ఒక సేవా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళాను. అక్కడకి వైసీపీ శాసనసభ్యుడు (ఆయన మాజీ మంత్రి కూడా లెండి) ముఖ్య అతిథిగా వచ్చాడు. సభ కార్యక్రమం జరుగుతుండగా సదరు నాయకుడితో వచ్చిన ఒక అనుచరుడు ఏందన్నా పార్టీ మారావా..? అని అడిగాడు. ఆ కుర్రోడు ఎందుకు అడుగుతున్నాడో నాకు అర్థం కాలేదు. అసలు నన్ను అన్నా అని సంబోధించే చనువు వాడితో నాకు లేదు, పైగా వాడికీ నాకు ఓ నలభై ఏళ్ళకు పైగానే వయసు వ్యత్యాసం ఉంటుంది. ఏమయ్యింది, ఎందుకలా అడుగుతున్నావు అని అడిగాను. పసుపు చొక్కా వేసుకున్నావే అని అడిగాడు. వాడు అడిగే వరకూ నేను ఏ రంగు చొక్కా వేసుకున్నానో కూడా నేను గమనించుకోలేదు. ఒక్కసారి షాకయ్యాను. అంటే, వేసుకునే బట్టలని బట్టికూడా అవతలవాడు ఏ పార్టీ సానుభూతిపరుడో చెప్తారా.. అని ఆశ్చర్యపోయాను. అదేంటి అలా అడుగుతావు, మన సాక్షి పత్రిక అంతా పసుపు రంగుతో నిండిపోయి ఉంటుంది కదా..! అంత మాత్రాన సాక్షి పసుపు పార్టీయా?.. నీ చాదస్తం తగలబడా అని అడిగాను. అతను ఆలా కాదన్నా అంటూ ఏదో వాదించబోయాడు, ఈ పిల్లకుంకతో ఎందుకులే అని అక్కడినుండి వెళ్ళిపోయాను. ఆమధ్య పచ్చచొక్కా వేసుకున్నాడని ఒక ప్రయాణికుడిని పోలీసులు బస్సులో నుండి దించేశారని కూడా పత్రికలలో చదివాం. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ధర్నాకి వెళ్లేవారిని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా వెంకటాచలం టోలుగేటు వద్ద పోలీసువారు అతన్ని దించేశారు. నేను ఏ పార్టీకీ చెందినవాడిని కాదు మొర్రో అని ఆ ప్రయాణికుడు మొరపెట్టుకున్నా ఖాకీలు వినలేదు. పసుపు శుభానికి చిహ్నం. ఇంట్లో పెళ్లి పెట్టుకుంటే పసుపు దంచడంతో పనులు ప్రారంభిస్తారు. తొలి పెళ్లిపత్రికకి పసుపు పూసి ఇస్తారు. మెడలో కట్టే తాళిని పసుపు తాడు అంటారు. ఇంటి గుమ్మానికి పసుపు రాస్తారు. చావుకి వెళ్ళొస్తే పసుపు నీళ్లు చల్లుకుని ఇంట్లోకి రమ్మంటారు. ఇవన్నీ అనాదిగా వస్తున్న ఆచారాలు. ఇలాంటి సెంటిమెంట్లు, సంప్రదాయాలూ కూడా తెలియని శుంఠల్ని మన నాయకులు పక్కన పెట్టుకుని తిరుగుతున్నారు. ఖర్మ..!

\- వి.శివనారాయణరెడ్డి, నెల్లూరు.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

## వైజేపి సభ.. విశ్లేషణ బాగుంది

'విశాఖ వైజేపి సభ సక్సెస్' అంటూ గతవారం మన 'లాయర్'లో రాసిన విశ్లేషణ చాలా బాగుంది. టీడీపీ , బీజేపీ, జనసేన పార్టీలకు రాష్ట్రంలో చోటులేదు, ఆంధ్రాలో హవా అంతా వైసీపీదే అని సంకేతాలు ఇచ్చేలా జగన్, మోదీ కార్యక్రమాలను తాను ప్రచారం చేసుకుని ఆయన టూర్‌ను హైజాక్ చేశారన్నది నిజం. హడావుడి అంతా వైసీపీ నేతలలోనే కనిపించింది. బీజేపీ, జనసేన పార్టీలు ప్రధాని పర్యటన సమయంలో డమ్మీలుగా మారాయి. సోము వీర్రాజుని ప్రధాని మీ పేరేమిటని ప్రశ్నించడం ఆ పార్టీకి ఘోర అవమానమే. వైసీపీ ఆడిన మైండ్‌గేమ్‌లో బిజెపి జనసేనలు ఇరుక్కున్నాయనే చెప్పొచ్చు. వీరిద్దరి అమాయకత్వంతో టిడిపి అయోమయంలో పడిపోయింది. మొత్తానికి జగన్ అధికారంలోకి వచ్చిన ఇన్నేళ్లకు ఆ పార్టీ రాజకీయంగా ఒక తెలివైన వ్యూహాత్మక అడుగువేసింది.

\- యం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.



# 'విక్రమ్'.. విజయం

## 'ప్రైవేట్' రాకెట్.. తొలి ప్రయోగం సక్సెస్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రీహరికోట నుంచి తొలి ప్రయోగంగా చేపట్టిన ప్రైవేట్ రాకెట్ విక్రమ్-ఎస్ ప్రయోగం విజయవంతం కావడంతో అంతరిక్ష రంగంలో భారత్ మరో సరికొత్త చరిత్ర సృష్టించినట్లయింది. ఈ రాకెట్‌కు భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయికి నివాళిగా 'విక్రమ్-ఎస్' అని నామకరణం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఒక ప్రైవేట్ సంస్థ రూపొందించిన రాకెట్‌ను ఇస్రో ప్రయోగించడం ఇదే మొదటిది కనుక 'మిషన్ ప్రారంభ్' అని కూడా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రయోగాల్లో అమెరికా, రష్యా, జపాన్, ఫ్రాన్స్, చైనాల తర్వాత ఆ ఘనత సాధించిన దేశంగా భారత్ రికార్డు సృష్టించింది.

### 5 నిమిషాల్లోనే ప్రయోగం పూర్తి :

ఈనెల 18వ తేది ఉదయం 11.30 గంటలకు షార్ నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకువెళ్ళింది. 81.5 కిలోమీటర్ల ఎత్తుకు ప్రయాణించి 3 పేలోడ్లను విడిచిపెట్టి, ప్రయోగం అనంతరం తిరిగి నిర్దేశిత లక్ష్యం మేరకు షార్‌కు 115.8కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో సురక్షితంగా పడిపోయింది. ఒక ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ నింగిలోకి విజయవంతంగా దూసుకువెళ్లడం ఇదే మొదటిసారి కావడం విశేషం. హైదరాబాద్‌లోని భారత స్టార్టప్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన 6 మీటర్ల పొడవు, 545 కిలోల బరువున్న ఈ బుల్లి రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో భారత శాస్త్రవేత్తలతో పాటు ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 5 నిమిషాల వ్యవధిలో ప్రయోగం పూర్తయింది. ప్రయోగాన్ని పర్యవేక్షించిన ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌తో పాటు, కేంద్రమంత్రి జితేందర్‌సింగ్ ప్రయోగ విజయాన్ని చూసి 'మిషన్ ప్రారంభ్' విక్రమ్-ఎస్ రాకెట్ ప్రయోగం విజయవంతమైందంటూ ప్రకటించి ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రయోగాలు మరిన్ని నిర్వహిస్తామని డా.సోమనాథ్ ఈ సందర్భంగా చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రోత్సాహం, ఇస్రో సహకారంతో అనేక ప్రైవేట్ సెక్టార్లు ఇస్రోతో భాగస్వాములయ్యాయని జితేంద్రనాథ్ తెలిపారు. షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇన్‌స్పేస్ అధినేతలు, స్కైరూట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవలే షార్ నుంచి ఇస్రోకి చెందిన వాణిజ్యవిభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్,యుకె కేంద్రంగా ఉన్న వన్ వెబ్‌తో ఒప్పందం కుదుర్చుకుని, ఆమేరకు 36 ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టిన నెలరోజుల లోపలే విక్రమ్-ఎస్ రాకెట్ విజయవంతం కావడం మరో విశేషం.



# చిన్ననాటి మిత్రుని మరణం.. బాధాకరం

## వెల్లంచేటి చంద్రమౌళికి మాగుంట శీనయ్య నివాళి

నెల్లూరు నగరంలో ఇటీవల కాలధర్మం చెందిన తన చిన్ననాటి స్నేహితుడు, ఆప్తమిత్రుడు వెల్లంచేటి చంద్రమౌళి (72)ని స్మరించుకుంటూ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఘననివాళులర్పించారు. ఈనెల 20వ తేదీన నెల్లూరు బాలాజీనగర్ పుట్టవీధిలోని చంద్రమౌళి నివాసానికి వచ్చి, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. తనకెంతో ఆత్మీయుడైన చంద్రమౌళి మరణాన్ని తాను తట్టుకోలేకపోయానంటూ బాధను వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచి చంద్రమౌళి తనకు స్నేహితుడని, విఆర్ కాలేజీ నుంచి తమ స్నేహం ఇంకా బాగా అభివృద్ధి చెందిందని, విఆర్ కళాశాల విద్యార్థుల సంఘం కార్యదర్శిగా చంద్రమౌళి తమకందరికీ నాయకత్వం వహించారని గుర్తుచేసుకున్నారు. మాగుంట కుటుంబానికి, కుటుంబంలోని సోదరులందరికీ ఆయన స్నేహితులని, తమతోపాటు తానూ ఒక సోదరుడిగా కలిసిమెలిసి ఉండేవారని ఆయన పేర్కొన్నారు. చంద్రమౌళి మృతికి ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ సందర్భంగా ఆయన కుమారుడు వెల్లంచేటి శేషగిరిని, కుమార్తె శిరీషను పరామర్శించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.




# జెన్‌కో ప్రైవేటీకరణ యత్నాలు దారుణం

## - మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య జెన్‌కో థర్మల్ విద్యుత్‌కేంద్రాన్ని ప్రైవేటీకరించాలని ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ప్రైవేటీకరణను సహించేదిలేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 22న ఆయన నేలటూరులోని జెన్‌కో వద్ద కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా జెన్‌కో జేఏసీ పరిరక్షణ కమిటీసభ్యులతో కలిసి భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ థర్మల్ కేంద్రాన్ని ప్రైవేటుపరం చేయొద్దని కోరుతూ కార్మికులు, ఉద్యోగులు గత 310 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని మండిపడ్డారు. ఇసుక నుంచి పవర్‌ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ దోపిడీకి పాల్పడుతున్నారని, వైకాపా నాయకుల అత్యాశ కారణంగా జెన్‌కో నష్టాల బారిన పడిందని, కావాలనే దానిని నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. థర్మల్ కేంద్రం ప్రైవేటీకరణ అర్ధరహితమన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఆలోచించి, ప్రైవేటీకరణ యత్నాలను మానుకోవాలని, కార్మికుల సమస్యలు తీర్చాలని సూచించారు. జెన్‌కోను ప్రభుత్వసంస్థగానే కొనసాగించాలని ఈ ర్యాలీలో పాల్గొన్న జెన్‌కో పరిరక్షణ కమిటీ కన్వీనర్ మోహన్‌రావు కోరారు. దీనిని ప్రైవేటుపరం చేస్తే భూ నిర్వాసితులకు ఇక ఉద్యోగాలు రావని ఆవేదన వ్యక్తం చేశారు. గోగుల శ్రీనివాసులు, మూలం రమేష్, దామా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రకృతి విపత్తుల సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలను రక్షించాలని జడ్పీ సిఇఓ చిరంజీవి సూచించారు. వెంకటాచలం మండలం, సరస్వతీనగర్‌లో ఆపద మిత్ర వలంటీర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఈనెల 22న ఆయన పాల్గొని మత్స్యకార మండలాల్లోని వలంటీర్లకు పలు సూచనలు చేశారు. ప్రకృతి విపత్తులు వస్తున్నప్పుడు ముందస్తు జాగ్రత్తలతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రెడ్‌క్రాస్, అగ్నిమాపక సిబ్బంది, డిపిఆర్‌సి అధికారులు పాల్గొన్నారు.


# మహనీయుల జీవితాలు మార్గదర్శకం



దేశానికి గొప్పసేవలందించిన ఎందరో మహనీయుల జీవితచరిత్రలను విద్యార్థులు చదువుకుని వారి స్ఫూర్తితో ఎదగాలని వక్తలు అన్నారు. కోవూరులోని వైకెఆర్అండ్‌కె ప్రభుత్వ డిగ్రీకాలేజీలో ఇటీవల జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో 'పరివర్తన' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిపి లక్ష్మీ ప్రసూన, డా. ఓ శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్ డా.కె రాంప్రసాద్, గ్రంథాలయాధికారి డా. నరమాల ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 31వ భాగం

పాండురాజు అన్నీ త్యాగం చేసి తీవ్రమైన తపస్సు చెయ్యటానికి ముగ్గుల్లె, దురదృష్టవశాత్తు మరణించటం వల్ల, శతశృంగ మునులు కుంతిని, పిల్లల్ని రక్షించుకోవటానికి, వారిని మాద్రి, పాండురాజు అస్థికలు తీసుకుని హస్తినాపురం బయలుదేరుతారు. హస్తినాపురం చేరుకోగానే నగర ప్రముఖులు, కౌరవ అగ్రగణ్యులు దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న పాండు కుమారులని చూసి, వీరు తప్పకుండా దైవాంశ సంభూతులని ఆశ్చర్యపోతారు. ధృతరాష్ట్రుడు పాండురాజుకి, మాద్రికి పరలోక క్రియలు చెయ్యమని విదురుని ఆదేశిస్తాడు.




ధృతరాష్ట్రుడు వారిని ఆదరించి తన పిల్లలతో సమానంగా చూసుకుంటాడు. కౌరవ, పాండు కుమారులు పెద్దవాళ్ళవుతారు. అందరూ కలిసిమెలిసి ఆడుకుంటారు. కానీ, ఏ ఆటలోనయినా భీమునిదే పైచెయ్యి. అది చూసి దుర్యోధనుడు భరించలేకపోతాడు. భీముడు బాల్య చాపంతో కౌరవ కుమారులను ఆటల్లో బాగా ఆట పట్టిస్తాడు. బరబరా ఇసుకలో ఈడ్చుకుపోతాడు, నీళ్లలో ముంచి వాళ్లకు భయం పుట్టిస్తాడు. వాళ్ళు చెట్టెక్కి కాయలు కోస్తుంటే చెట్టును ఊపి వాళ్ళం దర్నీ కింద పడేస్తాడు. ఇవన్నీ చూసి, భరించలేక భీముణ్ణి చంపటానికి పన్నాగం వేస్తాడు. చేతులు కట్టి నీళ్లలో పడేస్తాడు, పాముల చేత కరిపిస్తాడు, అన్నంలో విషం కలుపుతాడు. అయినా భీముణ్ణి అవేమీ చెయ్యలేవు. దుర్యోధనుడు ఇంకా పాండవుల మీద కసి పెంచుకుంటాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.






# జిల్లాకు కేంద్రప్రభుత్వ పురస్కారం

- **ఉత్తమ మెరైన్‌జిల్లాగా జాతీయస్థాయి గుర్తింపు**

జిల్లాకు కేంద్రప్రభుత్వం నుంచి మరో అరుదైన పురస్కారం లభించింది. నీలివిప్లవం ద్వారా ఆర్థికాభ్యున్నతికి కృషిచేస్తున్న ప్రాంతాలకు ఇచ్చే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును 2021-22 సంవత్సరానికి దేశంలోనే 'ఉత్తమ మెరైన్ జిల్లా'గా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఎంపికైనట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రప్రభుత్వం మత్స్యశాఖపై తీసుకుంటున్న చొరవ, అటు చేపల పెంపకం, ఇటు రొయ్యల సాగులో జిల్లా అధికారయంత్రాంగం తీసుకుంటున్న శ్రద్ధను అభినందిస్తూ కేంద్రం ఈ అవార్డును ప్రకటించడం హర్షణీయం. జాతీయస్థాయిలో జిల్లాకు లభించిన ఉత్తమ మెరైన్ జిల్లా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 21న అందుకున్నారు. డామన్‌లోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధిశాఖ కార్యదర్శి జితేంద్ర నాథ్ స్విన్ చేతులమీదుగా కలెక్టర్ ఈ పురస్కారం స్వీకరించారు. ఈ పురస్కారం కింద మూడు లక్షల రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేసి కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.

# వానలతో..నగరం జలమయం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత మూడురోజులుగా వర్షాలు చెదురుమదురుగానే కురుస్తూనే ఉండడంతో నెల్లూరు నగరం జలమయమైంది. రోడ్లు షరా మామూలే. మురుగుకాలువలకన్నా ఘోరం. జనం బాధలు కూడా మామూలే. ఎట్లయితేనేం..ఈనెల 22వ తేది ఉదయానికి వాన కొద్దిగా తెరపిచ్చింది. వాయుగుండం బలహీనపడడంతో కొంతసేపు ఎండ, మళ్లీ వాన..ఇలా బుధవారం కూడా అలాగే ఉండింది. జిల్లావ్యాప్తంగా కూడా వర్షాలు జోరుగానే కురిశాయి. ఈదురుగాలులు పెద్దగా లేకున్నా, వాతావరణం బాగా ముసురుపట్టింది. వానజల్లులతో జిల్లా తడిసిముద్దయింది.

# రక్తదానం చేసి ఆదుకోండి



ఈ వర్షాకాలపు సీజన్‌లో జిల్లాలో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు సోకుతున్నాయని, రక్తదాతలు బాధితులకు అవసరమైన రక్తం, ప్లేట్‌లెట్స్‌ను అందజేసి వారి ప్రాణాలను కాపాడాలని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ కోరారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19న ఆయన నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేసి మాట్లాడుతూ, యువత రక్తదానం చేసి రోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా...అనిల్



నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరుజిల్లా శాఖకు నూతన అధ్యక్షునిగా కొండా అనిల్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం తెలిపారు. ఆ మేరకు ఆయన నియామకాన్ని ఈనెల 22న నెల్లూరులోని అంబేద్కర్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షునిగా కొనసాగుతున్న అనిల్‌ను తమ సంఘానికి అధ్యక్షునిగా ఎంపిక చేశామని, ఎస్సీ వర్గీకరణకు, దళితుల హక్కులు కాపాడేందుకు ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి రమణారావు, సలహాదారు పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# వీఎస్‌యులో ఆక్వాకల్చర్‌పై వర్క్‌షాప్



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇటీవల ఆక్వాకల్చర్ యజమాన్య పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. వరల్డ్ ఫిషరీస్ డే సందర్భంగా వీఎస్‌యు మెరైన్ బయాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'బెస్ట్ మానేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ ఫిషరీస్' అనే అంశంపై జరిగిన ఈ వర్క్‌షాప్‌లో రొయ్యల సాగులో నూతన విధానాలకు సంబంధించిన సాంకేతిక అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్- ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.యం. సుందరవల్లి మాట్లాడుతూ ఫిషరీస్ ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ పి.జగన్‌మోహన్, బిఎంఆర్ ఇండస్ట్రీస్ క్వాలిటీ కంట్రోల్ హెడ్ ఎల్.బ్రహ్మానందరెడ్డి, ప్రొఫెసర్ జి.విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ సిహెచ్ వెంకట్రాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎం.సుందరవల్లి కాకుటూరు చెరువులో చేపపిల్లలను వదిలారు.

# ఉద్యోగుల సొమ్మును ప్రభుత్వం దోచుకోవడం దారుణం

**- ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భవిష్యత్ అవసరాల కోసం తమ జీతంలోంచి దాచుకున్న సొమ్మును కూడా రాష్ట్ర ప్రభుత్వం దోచుకోవడం దారుణమని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. ఈనెల 22న ఆయన నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిల విడుదల కోసం యుటిఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాందోళనలో పాల్గొని ప్రభుత్వతీరును విమర్శించారు. ఉద్యోగులను, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం శత్రువులుగా చూస్తోందని, ఇలాంటి పరిస్థితి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేదని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా, వారి ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్ సొమ్మును కూడా ప్రభుత్వం దోచుకుంటోందని, ఇదెక్కడి దారుణమని అసహనం వ్యక్తం చేశారు. డిఏ బకాయిలు ఇంతవరకు ఇవ్వలేదని, ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులపై ఆర్థిక అరాచకానికి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇకనైనా వెంటనే వారికి చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ నాయకులు నవకోటేశ్వరరావు, కె.తులసీరాంబాబు, జివి చలపతిశర్మ, వివి శేషు, అచ్చయ్య, ఏ.మురళీధర్‌రావు పాల్గొన్నారు.

# బాలలకు డ్రాయింగ్ పోటీలు



బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బాలలహక్కులపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత బాలల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం చిత్రలేఖనంలో విజేతలకు బహుమతుల అందజేశారు. విశ్రాంత సాంఘిక సంక్షేమాధికారి పటేల్, ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి.. ప్రాధాన్యత

**జేసీ కూర్మనాథ్**



జిల్లాలో మత్స్యకారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ చెప్పారు. ఈనెల 21న ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం నుంచి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను మత్స్యకారులకు సంపూర్ణంగా అందజేస్తున్నామని చెప్పారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆక్వా రైతులకు లైసెన్స్‌లను అందించారు.

# ప్రతి శనివారం..హౌసింగ్ డే

**- కార్పొరేషన్ కమిషనర్ హరిత**



నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ఇకనుంచి ప్రతి శనివారం 'హౌసింగ్ డే' కార్యక్రమం చేపట్టి, పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తామని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని 53 వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో ఆమె ఇటీవల పలు లే-అవుట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఇళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు లే-అవుట్ల నిర్మాణ పనుల్లో పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని చెప్పారు. విద్యుత్తు, వీధి దీపాలు, మంచి నీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామికి వైభవంగా.. పడిపూజ



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని వేదాయపాళెంలో కొలువైవున్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో ఇటీవల స్వామివారికి మండల ప్రజలు పవిత్రమైన 18 మెట్ల పడిపూజ ఘనంగా నిర్వహించారు. కేరళకు చెందిన ఆలయ తంత్రి నారాయణ నంబూద్రి, మేల్ శాంతిరామన్ తిరుమేని, రామచంద్ర బట్టు, సత్యనారాయణల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ మండల పూజలకు ఉభయకర్తలుగా సిద్దవరపు మధుసూదన్‌రెడ్డి - సుహాసిని దంపతులు, పవిత్ర 18 మెట్ల పూజకు దువ్వూరు విజయ భాస్కర్‌రెడ్డి-సుదీరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఛైర్మన్ శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహనరావు, మురళీ మోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# కనువిందు చేసిన..'సుకన్య'

## యుద్ధనౌకను చూసేందుకు వేల సంఖ్యలో సందర్శకులు

## క్రిక్కిరిసిన కృష్ణపట్నం పోర్టు



భారత నౌకాదళ దినోత్సవంలో భాగంగా, నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో ఉన్న ఆదాని కృష్ణపట్నం పోర్టుకు ఇటీవల ఎంతో ప్రతిష్టాకరమైన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ సుకన్య'ను ప్రదర్శనకు అధికారులు అనుమతించారు. 1971వ సంవత్సరం జరిగిన యుద్ధంలో భారత నావికాదళం పాక్‌లోని కరాచీ నౌకాశ్రయంపై మెరుపుదాడి చేసి భారత్ విజయానికి దోహదం చేయడంతో అందుకు గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ 4వ తేదీని 'నేవీ డే'గా జరుపుకుంటుంది. నేవీ డే కార్యక్రమాల్లో భాగంగా భారత నౌకాదళ యుద్ధనౌక విశాఖపట్నం ఓడరేవు నుంచి కృష్ణపట్నం ఓడరేవుకు వచ్చింది. 1వ నెంబరు బెర్త్ వద్దకు వచ్చి లంగరు వేసింది. 101 మీటర్ల పొడవు కలిగిన ఎంతో శక్తివంతమైన ఈ నౌక, సముద్రంలో శత్రువుల నుంచి ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కొనే సత్తా కలిగివుండడం విశేషం. ఈ అద్భుతమైన నౌకను చూసేందుకు సందర్శకులు పోటెత్తారు. ఉదయం 9 గంటల నుంచే సందర్శకులు భారీఎత్తున కృష్ణపట్నంకు చేరుకున్నారు. ప్రజలతో పాటు అనేక పాఠశాలల నుంచి వేలాదిమంది విద్యార్థులు, పెద్దసంఖ్యలో ఎన్‌సిసి కేడెట్లు ఈ నౌకను తిలకించేందుకు తరలిరావడంతో, సందర్శకులతో పోర్టు క్రిక్కిరిసిపోయింది. నౌక డెక్‌పై నుంచి సముద్రాన్ని వీక్షిస్తూ సంతోషించారు. ఈ సందర్భంగా నేవీ అధికారులు ఆ నౌక ప్రాశస్త్యాన్ని, యుద్ధ సమయంలో వినియోగించిన ఆయుధాలను, వాటి పనితీరును వివరిస్తుంటే విద్యార్థులు ఎంతో ఆసక్తిగా విన్నారు.

## ఎన్‌సిసి కేడెట్ల సందర్శన



నెల్లూరులోని కెఎన్ఆర్ మునిసిపల్ స్కూల్‌లోని 10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి కేడెట్లు కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ ఆదేశాల మేరకు ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో నౌకను సందర్శించారు. నౌక విశిష్టత గురించి, అందులోని ఆయుధ సంపత్తి ప్రాధాన్యత గురించి నౌకాదల అధికారులు ఎన్‌సిసి కేడెట్లకు వివరించారు. అనంతరం నౌకలోని అన్ని విభాగాల్లోనూ వారు కలయతిరిగి ఆనందించారు. భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌకను సందర్శించడం జీవితంలో ఒక మరపురాని అనుభవమని ఎన్‌సిసి కేడెట్లు సంతోష పడ్డారు. అయితే, నౌకను సందర్శించేందుకు అనుకున్నదానికంటే సందర్శకులు వేలసంఖ్యలో తరలిరావడంతో ఒకదశలో వారిని అదుపుచేయడానికి అధికారులు అవస్తలు పడ్డారు. భద్రతా కారణాల దృష్ట్యా మరుసటి రోజున సందర్శనకు అనుమతించలేదు. మొత్తమ్మీద సుమారు 8వేల మంది దాకా సందర్శకులు ఈ యుద్ధనౌకను తిలకించి ఉంటారని అధికారులు అంచనా వేశారు.

# 7 లక్షల మొక్కలు నాటాం - కలెక్టర్ చక్రధర్‌బాబు



జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 7 లక్షల మొక్కలు నాటామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 23న నెల్లూరు నగర శివార్లలోని నగరవనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమం క్రింద జిల్లా వ్యాప్తంగా 12.10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటికి అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో 7 లక్షల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. మిగిలిన మొక్కలను కూడా త్వరలోనే నాటేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జరిగిన వనమహోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. జేసీ కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ హరిత, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, సహాయ కలెక్టర్ విద్యాధరి, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, డిఎఫ్ఓలు చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు నిరంతర అధ్యయనం అవసరం



వ్యాధులు-వాటి నివారణలకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు వైద్యులు అధ్యయనం చేస్తుండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్-న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో న్యూరో ఎసెన్షియల్స్ సిఎమ్ఈ కార్యక్రమం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వక్తలు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ జి.అశోక్, అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. డాక్టర్ అచల్ గులాటి ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి, కార్యక్రమం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ, వైద్య, విద్య నిరంతరం అభ్యసించాల్సిన ప్రక్రియ అని అన్నారు. వైద్యరంగంలో ఆధునీకరించబడుతున్న విషయాల గురించి వైద్యులు నిరంతరం తెలుసుకుంటూ ఉండాలన్నారు. ప్రధానంగా వ్యాధికి సంబంధించిన క్లినికల్ లక్షణాలు, సంకేతాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఢిల్లీ, తమిళనాడు నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పలువురు హాజరయ్యారు. డాక్టర్ హరితకుమారి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




## 60 రోజుల్లో..

# 35 వేల ఇళ్లను సందర్శించిన ప్రసన్న

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 60 రోజుల్లో 35వేల ఇళ్లను సందర్శించి రికార్డు సృష్టించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి అందజేయడమే లక్ష్యంగా కోవూరు నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం 60వ రోజున కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెం సచివాలయం-1 పరిధిలో ఆయన ఇంటింటికి పర్యటించారు. ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. అనేకమంది సమస్యలు విని, తమవంతు చేయూతను అందించారు. అవసరమైన వారికి తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం కూడా అందించి అందరి అభిమానానికి పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకు అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనల్లో ఆయన వెంట నాయకులు వీరి చలపతిరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఓర్వలేకే జగన్‌పై..చంద్రబాబు విమర్శలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజాదరణ పెరుగుతుండడం చూసి ఓర్వలేకే చంద్రబాబునాయుడు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్న వ్యక్తి సభ్యత లేకుండా అసభ్యకరమైన మాటలతో ప్రభుత్వం పైనా, సిఎంపైనా తిట్లదండకం ప్రారంభించారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 19న కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం నాయుడుపాళెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో చంద్రబాబు చేసిన విమర్శలను ఖండించారు. అమరావతి చుట్టూ చంద్రబాబు తన అనుచరులకు భూములను కొనిచ్చి కోట్లాది రూపాయలను రాబట్టుకోవాలన్న ఆశలన్నీ నిరాశలు కావడంతో ఆ ఆక్రోశంతోనే సిఎం జగన్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. తొలుత ఆయన నాయుడుపాళెంలో ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్రం అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన అనేక పథకాలను ఆయన ప్రజలకు వివరించి ఆమేరకు పథకాల వివరాలతో ఉన్న కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆయన వెంట డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, మండల పార్టీ కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ మమత తదితరులు పాల్గొన్నారు.








## సినారెకు సన్మానం

మల్లెతీగ సాంస్కృతిక సంస్థ జాతీయ సాంస్కృతికోత్సవాల్లో భాగంగా 20వ తేదీ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సాహిత్యంలో తన కృషిని అభినందిస్తూ ప్రముఖ కవి చిన్ని నారాయణరావును సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ తెలుగు మరియు సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ డా. నందమూరి లక్ష్మీపార్వతి.

# 'డైట్' అధ్యాపకునికి కలాం అవార్డు



ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు డైట్ శిక్షణా సంస్థలోని సైన్స్ అధ్యాపకులు కె.విజయచంద్ర ఇటీవల డా. ఏపిజె అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురుపురస్కార్‌ను అందుకున్నారు. గుంటూరుకు చెందిన డా. చివుకుల హనుమంతరావు చారిటబుల్‌ట్రస్ట్ , సుగుణ సైన్స్ అకాడమీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయచంద్రకు ఈ విశిష్ట పురస్కారం లభించడం పట్ల డైట్ ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వరరావు, గణిత అధ్యాపకులు డా.ఆర్.బాలాజీరావు, లెక్చరర్లు బి.దశరథరామిరెడ్డి, పి.అల్తాఫ్, ఎస్‌కె జులేఖాబీ, ఎస్.బోయదాస్, నరసింహమూర్తి, డి.నర్శింగరావు, పి.సోమేశ్వర్, ఎన్.శివ, కె.షఫీఅహ్మద్‌లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను అభినందించారు.

# విషాదంగా ముగిసిన.. విహారయాత్ర

## సిద్ధేశ్వరకోన జలపాతంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

విహారయాత్రకు వెళ్ళి ఈతకోసం జలపాతం వద్ద దిగి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. దీంతో ఆ ప్రాంతమంతా విషాదం అలముకుంది. గూడూరు ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల రాపూరు మండలంలో ఉన్న సిద్ధేశ్వరకోనకు వెళ్లారు. వీరిలో ముగ్గురు అక్కడున్న జలపాతంలో ఈతకు దిగారు కానీ, కొంతసేపటికి ఇద్దరే బయటకు వచ్చారు. గూడూరుకు చెందిన గుర్రం వెంకట్ కల్యాణ్ అనే విద్యార్థి మాత్రం నీటిలో మునిగిపోయాడు. దీంతో ఆ విద్యార్థులు వెంటనే రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ క్రాంతికుమార్ సంఘటనాస్థలికి చేరుకుని గాలింపుచర్యలు ప్రారంభించారు. అప్పటికే చీకటిపడడంతో తెల్లవారిన తర్వాత మళ్లీ గజ ఈతగాళ్ళను రప్పించి వెదికించారు. దాదాపు మూడుగంటల గాలింపు తర్వాత, అక్కడున్న నీటిగుండంలో కల్యాణ్ మృతదేహం లభించింది. తమ బిడ్డ మృతదేహాన్ని చూసి తండ్రి రమేష్, కుటుంబసభ్యులు, వారితోపాటు బంధువులు, స్నేహితులు అందరూ పెద్దపెట్టున రోదించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి శవపంచనామా అనంతరం పోలీసులు ఆ విద్యార్థి మృతదేహాన్ని అప్పగించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



నెల్లూరు నుండి బెంగళూరుకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని గుర్తించిన గూడూరు పోలీసులు నిందితుడితో పాటు డ్రైవర్, లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై గూడూరు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గూడూరు మండలంలోని కామాక్షినగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర లారీకాటా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ లారీలో పది టన్నుల బియ్యంను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే లారీతోపాటు మల్లివేముల వెంకటేశ్వర్లు, లారీ డ్రైవరు నాగేళ్ళ వెంకట విజయకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఆ మేరకు నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ దశరథరామారావు, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతి ప్రదానం



మాజీప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినం సందర్భంగా ఇటీవల గూడూరులోని ఏపిజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు వారు డిఆర్‌డబ్ల్యూ కాలేజీలో బాలల దినోత్సవం సందర్భంగా జరిపిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఎం.నరేంద్రనాథ్ సభాధ్యక్షునిగా వ్యవహరించగా ముఖ్యఅతిథులుగా గూడూరు డిఎస్పీ ఎం.సూర్యనారాయణరెడ్డి, ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ పవన్‌కుమార్, బత్తిని విజయకుమార్, బండి శ్యామ్‌సుందర్, అరవ పార్వతయ్య, ప్రిన్సిపాల్ హనుమంతరావులు పాల్గొని దాదాపు 250 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు, మెమొంటోలు ప్రదానం చేశారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



ఈ నెల 20న నాయుడుపేటలో జరిగిన డిఎస్పీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి

# గిరిజన కాలనీలో దుప్పట్లు పంపిణీ



తిరుపతి జిల్లా గూడూరు రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో మధురెడ్డి లే అవుట్‌లోని గిరిజన కాలనీలోని 50 మందికి సొల్లేటి వెంకట సుబ్బయ్య దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని క్లబ్ అధ్యక్షులు ధనుంజయరెడ్డి అన్నారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు నాలుగు గిరిజన కాలనీల్లో తమ క్లబ్ ద్వారా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీనియర్ రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాసిన నాగులు, సిద్దారెడ్డి, హరి, వెంకటసుబ్బయ్య, రామ్మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీఎం సభకు డ్రెస్ కోడ్ పెట్టారా?

**- తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి శ్రావణిరెడ్డి**



సిఎం వై.యస్.జగన్ సభకు నలుపు రంగు చున్నీలు వేసుకొచ్చిన మహిళల పట్ల పోలీసుల తీరు అవమానకరంగా ఉందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. మహిళ ఒంటిపై వస్త్రాన్ని తొలగించడం అంటే నేరమని, ఈ ప్రభుత్వంలో మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, చివరికి ఆడపిల్లలు వేసుకునే చున్నీలపైన కూడా ఆంక్షలా అంటూ ఆమె ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి సభకు ఏమైనా డ్రెస్‌కోడ్ పెట్టరా? అంటే మహిళల ఒంటిపై నలుపు రంగు దుస్తులు, చున్నీలను చూసి వారు నిరసన తెలియచేస్తారేమో అన్న అభద్రతా భావాన్ని కలిగి ఉండటాన్ని చూస్తేనే తెలుస్తుంది... ఈ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందోనని ఆమె విమర్శించారు.

# 40 ఏళ్ళ మురుగు కాలువకు.. ఎట్టకేలకు మోక్షం

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఉమ్మారెడ్డిగుంట ప్రజల ఘనస్వాగతం



వేలాదిమంది నిరుపేద కుటుంబాలు నివసిస్తున్న ఉమ్మారెడ్డిగుంటలో దాదాపు 40 ఏళ్ళుగా ఉన్న ఓ పెద్ద మురుగుకాలువ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించేందుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన కృషిని స్థానిక ప్రజలు కొనియాడుతున్నారు. ఇక్కడ సీసీ డ్రైన్‌ను నిర్మించడంతో స్థానిక ప్రజలు సంతోషిస్తూ, డ్రైన్ నిర్మాణానికి కృషిచేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని అభినందిస్తున్నారు. ఇటీవల రూరల్ నియోజకవర్గంలోని 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటలో 51 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ డ్రైయిన్‌ను ప్రారంభించడానికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అక్కడికి వచ్చినప్పుడు ప్రజలు పెద్దఎత్తున పూలమాలలతో స్వాగతించారు. దారి పొడవునా పూలుచల్లుతూ తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతో శ్రమకోర్చి రైల్వే అధికారులతో పోరాడి ఈ సమస్యను పరిష్కరించడంతో ప్రజలు ఎమ్మెల్యే కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ కూకటి హరిబాబుయాదవ్, 21వ డివిజన్ అధ్యక్షులు మొయిళ్ళ సురేష్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.




# శ్రీసిటీలో 'సెబ్' సమీక్షా సమావేశం

తిరుపతి జిల్లా ఏఎస్పీ ఇ.సుప్రజ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీసిటీలో సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సమీక్షా సమాఏశం జరిగింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమరవాణాకు సంబంధించిన అన్ని మార్గాలను గుర్తించి, వాటి నిరోధానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని, మాదకద్రవ్యాల స్మగ్లర్లను, సరఫరాదారులను అరికట్టేందుశీఏకు సెబ్ అధికారులు, స్థానిక పోలీసులు సమిష్టిగా పనిచేయాలని ఏఎస్పీ ఆదేశించారు. సెబ్ సమావేశాన్ని శ్రీసిటీలో నిర్వహించినందుకు ఏఎస్పీకి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి సెబ్ ఏఎస్పీ బి.స్వాతి, గూడూరు సెబ్ ఏఎస్పీ ఎస్.రవికుమార్, సెబ్ డిఎస్పీ జానకిరామయ్య, తిరుపతి సెబ్ డిఎస్పీ శ్రీనివాసులు, శ్రీసిటీ డిఎస్పీ జగదీష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

○ 'సరస్వతీ' విలాపం

# నిధులు లేవు.. బకాయిలు రావు



- గ్రంథాలయాలకు.. 37 కోట్ల దాకా 'సెస్సు బకాయిలు'
- ఏళ్లతరబడిగా చెల్లించని పంచాయతీలు, మునిసిపాలిటీలు
- అభివృద్ధికి ఆమడదూరంలో విజ్ఞాన బాండాగారాలు

**ఏటా గ్రంథాలయాల వారోత్సవాలు ఉత్సాహంగా..గొప్పగా జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఆ గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సు బకాయిలను స్థానిక సంస్థలు సక్రమంగా చెల్లించకపోతుండడంతో ఎంతోకాలంగా సరస్వతీ నిలయాలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నారులకు, విద్యార్థులకు, పెద్దలకు అందరికీ విజ్ఞానాన్ని సమకూర్చే విజ్ఞాన బాండాగారాల్లో ఎన్నో అమూల్యమైన పుస్తకాలు భద్రపరిచే సౌకర్యాలు లేక క్రమేణా చెదలు పట్టిపోతున్నాయి. రాష్ట్రప్రభుత్వం ఇటీవలి కాలంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఇస్తున్న నిధులతోనే పుస్తకాలు కొనడం, వసతులు కల్పించడం జరుగుతున్నాయి కానీ, పూర్తిస్థాయిలో గ్రంథాలయాల అభివృద్ధికి సెస్సు మొత్తాలే కీలకం. కానీ వీటి చెల్లింపులో ఎంతోకాలంగా నిర్లక్ష్యం జరుగుతూనే ఉంది. దాదాపు 37 కోట్ల రూపాయలకు పైగానే బకాయిలు పేరుకుపోయాయి. వీటిని ఇంకా ఎంతకాలానికి చెల్లిస్తారో ఆ దేవుడికే తెలియాలి. ఇకనైనా ఉన్నతాధికారులు, స్థానిక సంస్థలు దయతలచి ఆ బకాయిలు చెల్లిస్తే తప్ప గ్రంథాలయాలకు మోక్షం ఉండదు.**

గ్రంథాలయోద్యమం ఎంతో మహత్తరమైనది. ప్రజలకు విజ్ఞానాన్ని అందజేసేందుకు ఎందరో మహనీయులు గ్రంథాలయాలకు శ్రీకారం చుట్టారు. అయితే, రానురాను గ్రంథాలయాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. అనేకరకాల సమస్యల చెదలో అల్లాడుతున్నాయి. సెస్సు బకాయిలు కోట్లల్లో ఉన్నా అవి వసూలుకాకపోవడంతో.. అభివృద్ధికి నిధుల్లేక నీరసపడుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎంతో అమూల్యమైన గ్రంథాలయాలున్నాయి. పాత నెల్లూరుజిల్లా పరిధిలో దాదాపు 60 లైబ్రరీలున్నాయి. నెల్లూరులో జిల్లా కేంద్రగ్రంథాలయం, జిల్లావ్యాప్తంగా శాఖాగ్రంథాలయాలున్నాయి. అయితే ఈ జిల్లా గ్రంథాలయ సంస్థకే సరైన భవనం లేకపోవడం విచారకరం. కొత్త భవనానికి 2019లో శంకు స్థాపన చేసినా, నిధులు లేకపోవడంతో ఆ పనులు మూలబడడం గ్రంథాలయాల దురవస్తకు ఒక ఉదాహరణ. ఈ భవన నిర్మాణానికి ఇంకా కనీసం 2 కోట్ల రూపాయల దాకా కావాల్సి ఉంటుంది. కానీ నిధులుంటేగా?..కావలి, గూడూరు, కోవూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరిలలో మంచి గ్రంథాలయాలున్నాయి కానీ ఎక్కడా ఆశించిన స్థాయిలో వసతులు ఉండడం లేదు. నిత్యం పాఠకులు, విద్యార్థులు ఈ గ్రంథాయాలకు పెద్దసంఖ్యలో వస్తూనే ఉంటారు. వాటిలో వేలకొద్దీ అపురూపమైన పుస్తకాలు, గ్రంథాలున్నాయి. కానీ ప్రభుత్వ నిబంధనల మేరకు వాటికి చెల్లించాల్సిన పన్నుల మొత్తాన్ని స్థానిక సంస్థలు ఏటా ఒకసారైనా పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో, నిధుల కొరతతో గ్రంథాలయాలు ప్రగతికి దూరమవుతున్నాయి. ఒక్కోచోట గ్రంథాలయాలు వానకు ఉరుస్తూ, శిథిలావస్తలో ఉంటున్నాయి. కొన్ని లైబ్రరీలు అద్దెఇళ్ళలో కాపురం చేస్తున్నాయి. పుస్తకాలను బైండింగ్ చేయించడం, వాటిని భద్రపరిచేందుకు డిజిటల్ వ్యవస్థ లేకపోవడం, పుస్తకాల క్యాటలాగ్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసే వ్యవస్థ లేకపోవడం, పాఠకులకు పుస్తకాలను అందించేందుకు జెరాక్స్ వంటి సౌకర్యాలు కానీ, నిపుణులైన సాంకేతిక సిబ్బంది కానీ కొరవవడం వంటి సమస్యలు ఎంతోకాలం నుంచీ ఉన్నవే. ఈ సమస్యలు ఇంకా ఎన్నేళ్ళకు తీరుతాయో చెప్పలేం.

**బకాయిల వివరాలు (సుమారుగా) :**

| | |
|---|---|
| నెల్లూరు కార్పొరేషన్ | రూ. 27 కోట్లు |
| గూడూరు మునిసిపాలిటీ | రూ. కోటీ 44 లక్షలు |
| కావలి మునిసిపాలిటీ | కోటీ 39 లక్షలు |
| ఆత్మకూరు మునిసిపాలిటీ | రూ. 63 లక్షలు |
| వెంకటగిరి మునిసిపాలిటీ | రూ. 45 లక్షలు |
| నాయుడుపేట మునిసిపాలిటీ | రూ. 14 లక్షలు |
| బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీ | రూ. 11 లక్షలు |
| అల్లూరు పంచాయతీ | రూ. 73వేలు |
| సూళ్ళూరుపేట మునిసిపాలిటీ | రూ. 35వేలు |
| అన్ని పంచాయతీల్లో కలిపి మరో | రూ. 3.29 కోట్లు |

## ఒక్క.. నెల్లూరు కార్పొరేషన్‌లోనే.. 27 కోట్లకు పైగా బకాయిలు

మునిసిపాలిటీలు, పంచాయతీల్లో ప్రజలు చెల్లించే పన్నుల్లో గ్రంథాలయాల పన్ను కూడా ఒకటి. ఆయా సంస్థలు పన్నులు వసూలుచేసుకుంటున్నా, గ్రంథాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన మొత్తాలు మాత్రం ఏళ్ల తరబడిగా ఇవ్వకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంది. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ నుంచే సుమారు 27 కోట్లకు పైగానే బకాయిలు రావాల్సి ఉంది. లైబ్రరీ సెస్సు బకాయీలు చెల్లించకపోవడంలో నంబర్-1 నెల్లూరే కావడం విచారకరం. 2007-08 సంవత్సరాల నుంచి ఈ బకాయిలు జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. గత 15 సంవత్సరాలుగా బకాయిలు పెరిగిపోతున్నా.. సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం దురదృష్టకరం. బకాయిల మొత్తాలు కోట్లల్లోకి చేరినా వాటి చెల్లింపుల్లో ఆ సంస్థల నిర్లక్ష్యం గ్రంథాలయాలకు శాపంగా మిగులుతోంది.

ఒక్క సూళ్ళూరుపేట మునిసిపాలిటీ మాత్రం ఎంతో నయం.. ఎప్పటికప్పుడు బాకీ తగ్గించుకుంటోంది. సేకరించిన సమాచారం మేరకు గ్రంథాలయాల సెస్సు బకాయిల వివరాలు పైన సూచించిన పట్టికలో ఉన్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అధికారులు పెద్దమనసు చేసుకుని సెస్సు బకాయిల చెల్లింపును వేగవంతం చేసి గ్రంథాలయాల సమస్యలు తీర్చి, వాటి అభివృద్ధికి సహకరించాల్సి ఉంది.

## 'ఎగురుతున్న పద్యం'.. ఆవిష్కరణ 27న

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు రచించిన 'ఎగురుతున్న పద్యం' కవితాసంపుటిని ఈనెల 27న నెల్లూరు ఆసుపత్రిలోని సమావేశమందిరంలో ఆవిష్కరించనున్నారు. ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ సోమిరెడ్డి జయప్రద పుస్తకావిష్కరణ చేస్తారని, డా. సుంకర గోపాలయ్య సమీక్షిస్తారని, గోవిందరాజు సుభద్రాదేవి, మోపూరు పెంచలనరసింహం, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పలువురు కవులకు, కవయిత్రులకు ఆత్మీయ సన్మానాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

## చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు

బుచ్చిరెడ్డిపాళెంలోని పద్మావతి కల్యాణమండపంలో ఈనెల 20న చెస్ పోటీలు జరిగాయి. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులు సుమారు 135 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలి 5 స్థానాల్లో వరుసగా మారుతిమోహన్, అల్లూరి సుమనీష్, జెకె రాజు, సిహెచ్ శ్రీనివాసులు, వి.త్రిపురాంబిక విజేతలుగా నిలిచారు. నిర్వాహకులు వీరికి నగదు బహుమతులను, ట్రోఫీలను బహుకరించారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ టీవీ నరసింహులు, బాలనరసింహ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబరులో.. బ్యాడ్మింటన్ పోటీలు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 8,9 తేదీల్లో జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగనున్నాయి. జోన్-3 కింద గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఈ పోటీలు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆ సంస్థ చీఫ్ కోచ్ ఆర్‌కె యతిరాజ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు 'శాప్ లీగ్స్' అనే యాప్‌ను గూగుల్‌స్టోర్ నుంచి డౌన్‌లోడు చేసుకుని నవంబరు 30వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 94944 92717 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## కరేడులో..శివపార్వతుల కల్యాణం

కార్తీకమాసం సందర్భంగా ఉలవపాడు మండలంలోని కరేడులో కొలువైవున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

## టూకీగా...



### మూలస్థానేశ్వరునికి కల్యాణోత్సవం

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరుని ఆలయంలో స్వామివారికి-అమ్మవారికి ఈనెల 20న కన్నులపండువగా కల్యాణోత్సవం జరిగింది. సత్యనారాయణగుప్తా-పూర్ణిమ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కావలిలో..కార్తీక వనభోజనాలు

కార్తీకమాసం సందర్భంగా ఇటీవల కావలిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మహిళాభక్తుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కందుకూరి వెంకటసత్యనారాయణ, కార్యదర్శి చీదెళ్ళ రామచంద్రరావు తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### పడుగుపాడులో..ఫ్యామిలీ డాక్టర్

కోవూరు మండలం పడుగుపాడులో ఇటీవల ఇనమడుగు ప్రాథమిక కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించి సచివాలయం పరిధిలోని పలువురి ఇళ్ళను సందర్శించి వారికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అంజేశారు.

### గిరిజన సంక్షేమశాఖ.. 'స్వచ్ఛత' ర్యాలీ

నెల్లూరులోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20న 'జాతీయ గౌరవ దివస్' సందర్భంగా ఐటిడిఏ కార్యాలయం నుంచి ఏసీ స్టేడియం వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐటిడిఏ పీఓ మందా రాణి, డిటిడబ్ల్యుఓ పరమిళ, గిరిజన ఉద్యోగుల నాయకుడు సిహెచ్ సుబ్బారావుతో పాటు పెంచలయ్య, పి.శ్రీనివాసులు, ఉష, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

### బుడంగుంటలో.. పేకాటరాయుళ్ళు దొరికారు

కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడంగుంటలో ఈనెల 20న రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటరావు, పోలీసులు దాడులు చేసి ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2,640 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

### చుంచులూరులో.. అయ్యప్పస్వామికి పూజలు

మర్రిపాడు మండలంలోని చుంచులూరు గ్రామంలో జొన్నా సత్యనారాయణ-అరుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఇటీవల అయ్యప్పస్వామికి ఘనంగా పూజలు జరిగాయి. మర్రిపాడు, అనంతసాగరం, కలువాయి తదితర మండలాల నుంచి పెద్దసంఖ్యలో మాలధారణ చేసుకున్న అయ్యప్ప భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించి, భిక్ష స్వీకరించారు.

### అప్పారావుపాళెం పాఠశాలకు.. ఆర్‌ఓ ప్లాంట్

ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో నీటివసతి కోసం దాత పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు ఇటీవల ఆర్‌ఓ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. విద్యాకమిటీ మాజీ ఛైర్మెన్ వింజమూరి పెంచలయ్య, హెడ్మాస్టర్ సుబ్బారావు, వెంకటేశ్వర్లురెడ్డి, మారుతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ అవగాహనపై.. కళాజాతా

నెల్లూరులోని రంగనాయకులపేట ఈనెల 20న సింహపురి స్వగత మహిళామండలి ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కళాజాతా జరిగింది. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో శ్రీనివాసరావు కళాబృందం ఆటపాటలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమం అందరినీ అలరించింది.

### ఉదయగిరిలో.. పూర్వ విద్యార్థుల చేయూత

ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థి మస్తాన్‌కు జీవనాధారం కోసం ఎం.పద్మజ, ఆమె తల్లి జ్ఞాపకార్థం కొత్త రిక్షాను అందజేశారు. మస్తాన్ పేదరికంతో బాధపడుతున్నాడని తెలిసి, పూర్వవిద్యార్థుల సహకారంతో ఈ ఏర్పాటుచేశారు. ఎం.మన్సూర్ ఆలీ, మునీ, సురేష్, ఖాజామస్తాన్, సందాని, మురళి పాల్గొన్నారు.

# స్టార్‌వార్

(మొదటి పేజీ తరువాయి)

తండ్రి వారసత్వంతో రాజకీయాలలోకి వచ్చి వెన్ను చూపని వీరుడిగా, అనుకున్నది సాధించే మగధీరుడిగా, తనను తాను రుజువు చేసుకున్న యువ రాజకీయవేత్తగా ఆంధ్ర సీఎం జగన్ గుర్తింపు పొందారు. భారతదేశ చరిత్రలోనే రికార్డు సృష్టించే విధంగా ఓదార్పు యాత్ర, పాదయాత్రల ద్వారా ప్రజల గడపలు తొక్కి, వారి గుండెల్లో స్థానం సంపాదించుకుని అనూహ్యంగా 175 సీట్లకు గాను 151 సీట్లను సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిది. అయితే, ప్రజలు, ఆయన అభిమానులు, అనుయాయులు, రాజకీయ అనుభవజ్ఞులు ఊహించిన స్థాయిలో జగన్ పరిపాలన, ఆయన ప్రవర్తన లేవన్నది వారి భావన. రాజశేఖర రెడ్డి కొడుకుగా ఆయనలోని కొన్ని గుణాలను, లక్షణాలను జగన్‌లో ఆశించిన వారికి నిరాశే మిగిలింది. రాజకీయ అపరిపక్వ 'సలహాదారు'ల మాటలు విని, జగన్ కొన్ని విషయాలలో రాంగ్ ట్రాక్‌లో వెళ్తున్నారన్నది వారి అభిప్రాయంగా వినపడుతోంది. అశేష జనాకర్షణ కలిగిన సినిమావారిని ఇబ్బందిపెట్టే విధంగా సీఎం క్యాంపు కార్యాలయం వ్యవహరించడాన్ని సినిమా ప్రముఖులు జీర్ణం చేసుకోలేకపోతున్నారని సినిమా పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా అగ్రతారలు తాడేపల్లికి వచ్చినప్పుడు వాళ్ళని సరిగ్గా పట్టించుకోకపోవడం, క్యాంపు కార్యాలయం వరకు వాళ్ళ వాహనాలను అనుమతించకపోవడం, చాలా దూరం వాళ్ళని నడిపించడం... ఇవన్నీ వాళ్ళు ఊహించని సంఘటనలు. ఇలా జరుగుతుందని తెలిసుంటే తామసలు వచ్చే వాళ్ళమే కాదని ఇద్దరు యువహీరోలు నొచ్చుకున్నారని కూడా సినీవర్గాల భోగట్టా.

## అల్లు స్టూడియోస్ వేదికగా వ్యూహరచన..?

అల్లు కుటుంబం హైదరాబాదులో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అల్లు స్టూడియోస్‌లో ఆంధ్ర రాజకీయాలపై వ్యూహరచన జరుగుతుందని రాజకీయవర్గాల మాట. అందులో భాగంగానే 'ఆహా' ఓటీటీలో బాలకృష్ణ స్వయంగా నిర్వహిస్తున్న 'అన్‌స్టాపబుల్' కార్యక్రమాన్ని పునః ప్రారంభించారని సమాచారం. తొలి ఇంటర్వ్యూకి చంద్రబాబుని ఎంపిక చేయడం కూడా ఈ పథకంలో భాగమే నట. ప్రతీ కార్యక్రమంలోనూ 'జై బాలయ్య' అంటూ బాలకృష్ణకి జిందాబాదులు కొట్టిస్తున్నారు. అంతకముందు ఆహాలో ప్రసారమైన ఇండియన్ ఐడల్ తెలుగు పాటల పోటీల సమయంలో కూడా పదేపదే 'జై బాలయ్య' అని చెప్పించడం కూడా ఇక్కడ గమనార్హం.

## కుల సమీకరణ..!

సినిమా రంగాన్ని తొలినుండి ప్రధానంగా కమ్మ సామాజికవర్గమే తమ సొంతం చేసుకుంది. ముందు తరంలో దాసరి నారాయణరావు, ఆ తరువాత వచ్చిన చిరంజీవి కాపు సామాజికవర్గం వారైనా కొన్ని సమయాలలో అక్కడ ఉన్న అధిపత్యానికి తలవంచక తప్పలేదు. ఇప్పుడు జగన్ ఓటమి కోసం రెండు వర్గాలు ఒక్కటైనా ఆశ్చర్యం లేదంటున్నారు విశ్లేషకులు. ఇద్దరికీ కామన్ శత్రువు జగనే కావడంతో ఆంధ్రా విషయంలో అందరూ ఒక్కటైపోతారని అంటున్నారు. తెలుగుదేశం తమ కుటుంబ పార్టీ కాబట్టి, చంద్రబాబుకి మద్దతు తెలుపడానికే నందమూరి కుటుంబం మొగ్గు చూపిస్తుంది.

## తన మనసులో మాట బయటపెట్టిన చిరంజీవి..!

ఇప్పటికే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ద్వారా జగన్‌కి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు. తాజాగా చిరంజీవి కూడా 'మీ అందరి ఆశీస్సులతో రాజకీయాలలో మా తమ్ముడిని ఉన్నత స్థానంలో చూసుకోవాలనుకుంటున్నాను. రాజకీయాలలో మాటలు అనాలి, అనిపించుకోవాలి, అందుకు అన్ని విధాలా సమర్థుడు కళ్యాణ్' అని తన మనసులో ఉన్న కోరికను బయటపెట్టేశారు. అటు బీజేపీ సైతం అల్లూరి సీతారామరాజుతో ఏ సంబంధం లేని చిరంజీవిని అల్లూరి విగ్రహ ఆవిష్కరణకి ఆహ్వానించడం, 'ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022' అవార్డుకి చిరంజీవిని ఎంపిక చేయడం వంటివి చిరంజీవి ద్వారా రాజకీయ లబ్ది పొందడం కోసం బీజేపీ ముందరకాళ్లకు వేస్తున్న బంధాలే అన్నది మేధావుల అభిప్రాయం. భారతదేశంలో అనేక ప్రధాన భాషల్లో అద్భుతమైన నటులుంటే ఈ ఏడాది టాలీవుడ్ నుండి చిరంజీవినే ఎంపిక చేయడం ఇప్పుడు అటు సినీ రంగంలోనూ ఇటు రాజకీయ రంగంలోనూ పెద్ద చర్చనీయాంశంగా మారింది. హైదరాబాదులో జూనియర్ ఎన్టీఆర్‌తో అమిత్‌షా భేటీ, విశాఖలో పవన్ కళ్యాణ్‌ని ప్రధాని మోడీ ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడడం కూడా ఈ రాజకీయ ఎత్తుగడలో భాగమే అంటున్నారు విశ్లేషకులు.

సమాజంలో రాజకీయ రంగంతో పాటు సినిమా రంగం కూడా చాలా ప్రధానమైనది. రాజకీయ రంగంలో ప్రధాన పార్టీలన్నిటికీ అభ్యర్థులు ఉంటారు. ఎన్నికల బరిలో దిగినప్పుడు మాత్రమే వారంతా హీరోలు. కానీ, వారి హీరోయిజం వారి నియోజకవర్గం వరకే. వాళ్లంతా రోడ్లపైకి వచ్చి బహిరంగంగా నటించి ఓటర్లని మెప్పించాలి. రంగుల ప్రపంచం అలా కాదు. వాళ్ళు బయటికిరారు. కేవలం కెమెరాల వెనకే నటిస్తారు. తమ నటనా చాతుర్యంతో అభిమానులను మెప్పిస్తారు. వెండితెర ద్వారా సమాజాన్ని ప్రభావితం చేస్తారు. రాజకీయ నాయకులకు శాశ్వత అనుచరులు ఉండరు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుడి వైపు కార్యకర్తలు, ప్రజలు వెళ్ళిపోతారు. సినిమా వాళ్లకు అలాకాదు, వాళ్లకి అభిమానులు శాశ్వతంగా ఉంటారు. వారి వారసులను కూడా అక్కున చేర్చుకుంటారు. తండ్రుల కటౌట్లకు మాలలు వేసి అభిషేకాలు చేసినట్టు వారి కొడుకులకు కూడా హారతులు పడతారు. సమాజాన్ని సినిమాలు ప్రభావితం చేసినంతగా రాజకీయాలు ప్రభావితం చేయలేవు.

కొత్తగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్‌లో సినిమావాళ్లకి ఎలాంటి ఆస్తులూ లేవు. ఇక్కడ స్టూడియోలు కూడా లేవు. వాళ్ళ సంస్థానాలన్నీ తెలంగాణలోనే ఉన్నాయి. జగన్‌మోహన్‌రెడ్డితో వాళ్లకి పెద్దగా మొహమాటం లేదు. తమనేదో చేసేస్తారనే భయం అసలే ఉండదు. సినిమా హీరోలకు జగన్‌పై ఉన్న అసంతృప్తిని అవకాశంగా మల్చుకుని, తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రధాన విపక్షాలు పావులు కదుపుతున్నాయని అటు సినీ వర్గాలు, ఇటు రాజకీయ విశ్లేషకులు ఖరాఖండిగా చెప్తున్నారు. ఇలాంటి తరుణంలో వీళ్ళు భావిస్తున్నట్లుగా రాబోయే ఆంధ్రా ఎన్నికలలో పొలిటికల్ స్టార్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇంతమంది సినిమా స్టార్స్ బరిలో దిగితే జరిగేది 'స్టార్‌వారే'...!

## వెంకటగిరి సంస్థానాధీశులు..
# రాజా గోపాలకృష్ణ యాచేంద్ర కన్నుమూత



వెంకటగిరి సంస్థానాధీశులు, ప్రజాసేవాతత్పరులు రాజా వెలుగోటి మదనగోపాలకృష్ణ యాచేంద్ర ఈనెల 23వ తేది బుధవారం రాత్రి హైదరాబాదులో స్వర్గస్తులయ్యారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. వెంకటగిరి సంస్థానం పెద్దరాజా స్వర్గీయ వివివిఆర్‌కె యాచేంద్ర సోదరులైన గోపాలకృష్ణ యాచేంద్ర వెంకటగిరికి ఎంతో సేవ చేశారు. పలు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలందుకున్నారు. వెంకటగిరి క్రాస్‌రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల, ఎన్జీఓ కాలనీ, అగ్నిమాపక దళ కార్యాలయం, తెలుగుగంగ కార్యాలయం తదితరాలన్నీ ఉన్న స్థలాలు ఈయన దాతృత్వంతో ఇచ్చినవే. వేలకోట్ల విలువైన భూములను ఆయన వెంకటగిరి ప్రజల అభ్యున్నతి కోసం వెచ్చించి దానశీలిగా పేరొందారు. ఏపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మెన్ రాజా వి.సత్యప్రసాద్ యాచేంద్ర వీరి తనయులే. 24.11.1932లో జన్మించిన గోపాలకృష్ణ యాచేంద్ర 23.11.2022న, సరిగ్గా 90 సంవత్సరాలు నిండడానికి కేవలం ఒక్కరోజు ముందు ఆయన కాలధర్మం చెందడం విధి విచిత్రం. బతికినంత కాలం ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, పరిపూర్ణ జీవితాన్ని సాగించారు. వెంకటగిరి ప్రజలతోనూ సన్నిహితంగా గడిపి వారి కష్టాల్లో పాలుపంచుకున్నారు. ఆయన మరణవార్త వెంకటగిరి రాజా సంస్థానంలోని వారికి, రాజావారి కుటుంబసభ్యులకు, వెంకటగిరి ప్రజలకు తీరని ఆవేదన కలిగించింది.

# ఫ్రెండ్స్ వాకర్స్‌కు.. అవార్డులు




నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సేవలను మెచ్చుకుంటూ గంటూరులో ఈనెల 20న 203–వాకర్స్ జిల్లా (గుంటూరు–ఒంగోలు–నెల్లూరు) వార్షిక సమావేశంలో పలు అవార్డులు బహుకరించారు. వాకర్స్ గవర్నర్ గ్రంథి హనుమంతరావు అధ్యక్షత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమసేవల్లో ప్రథమస్థానం లభించింది. ఈ సందర్భంగా ఆరు పురస్కారాలను వారికి అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు కొండూరు సుబ్బారావుకు ప్రత్యేక ప్రశంసలు, పురస్కారంతో పాటు వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడుకు, ఎలక్ట్ గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డిలకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి ద్వారా, అధ్యక్షులు సుబ్బారావు, కోశాధికారి రావూరి సుబ్బారావు, పి.శ్రీనివాసులు, రఫీ, రామమోహన్‌రెడ్డి, వెంకట్రాజు, జివి కృష్ణయ్యలతో కలసి వారు ఈ అవార్డులను అందుకున్నారు.

# మరో వన్నెల వెన్నెల జలపాతం.. 'వర్ణలిపి'

**కం: మనమెప్పుడాడు మాటలు**
**ననయము వ్రాసికొనుచుండు-నర్థములైనన్**
**ఘన విన్యాస చతురతల**
**మనసుల లోగొండ్రు, కవులు-మాన్యులుగారే**

– జొన్నవిత్తుల రామకృష్ణశర్మ

మాన్యతములైన కవుల గురించి చెప్పిన పై మాటలు ఈ 'వర్ణలిపి'లోని కవిత్వానికి అక్షరాలా అన్వయిస్తాయి.

వర్ణం అంటే ఓంకారం. అకార ఉకార మకార – నాద బిందువులనే పంచవర్ణాలతో సమ్మిళతమైనది ఓంకారం. అదే సృష్టికి శ్రీకారం. ఆ సృష్టి అమ్మతో మొదలౌతుంది. అందుకే ఈ పుస్తకం "అమ్మతీసే దిష్టి" అనే కవితతో ఆరంభమైంది. ఆ అమ్మ శ్రమే "నా వంటిమీద ఎప్పటికీ చెమట ఆరని తడి" అనగానే దిష్టి తీసే అమ్మచేతుల చలవ నేరుగా గుండెల్లోకి ఇంకుతుంది.

మన వర్ణాంధుల ఆకాశానికి నీలం ఉండదు. దాన్నిండా"ఇనపచెట్ల దర్శనం–సాలె గూడులా నగరానికి అల్లుకున్న టవర్లపైన – క్రూరపు గద్దల కాపురం" అంటూ "ఇనపచెట్లు"కవితలో సాంకేతిక విప్లవం పిచ్చుకని గోడమీది బొమ్మగా మార్చిన వైనాన్ని కళ్ళకు కడతారు.. కవి పెరుగు రామకృష్ణ. కవిత్వానిక్కూడా వర్ణక్రమం ఉంటుంది. దానికి ఏమాత్రం వర్ణాంధత్వం లేదు, రాదు. ప్రతి ఉదయమూ హృదయంలాగా వర్ణ రంజితమే. ఆ ఉదయంలో కదులుతున్న కాలాన్ని లిప్తలవారీగా మారిపోయే రంగుల్లో వెతుక్కుంటే కనిపించేదే సవర్ణ సమాజం. అది రుధిరమై కురుస్తూ కవిత్వంగా ఎలా మారుతుందో చెబుతూ," బహుశా హృదయానికి తెలుసేమో–తనదాకా రక్తాన్ని మోసుకు వచ్చి–చెడు రక్తాన్ని శుద్ధీకరణకు దారిచూపే–ప్రవాహ వేగం కవిత"అంటారు. ఆ వేగం వర్ణలిపిలోని ప్రతి కవితలోనూ వన్నెల జలపాతమై దూకుతుంది. ఉల్కాపాతమై వర్షిస్తుంది. "చెమట తడితో విన్పించే మంత్రగానం కవిత" అని నిరూపిస్తుంది. దాంతో పాఠకులు కవిత్వానికి కొత్త వర్ణక్రమం దిద్దుకుంటారు.

వర్ణాలన్నీ కలగలసినచోట రంగులపులగం ప్రసాదంగా మారే వైనం గమనిస్తే జీవితానికి పరమార్థం ఎలా బోధపడుతుందో చెబుతూ "దేహాలయం" కవితలో "ఎన్నిమెట్లెక్కినా – ఎన్ని కొండలెక్కినా–చివరకు నిన్ను నువ్వు చేరుకోవడమే కదా?" అంటూ జీవాన్ని అబ్బురపరుస్తారు. అక్కడితో ఆగకుండా జీవానికి జవమైన ఏకతకే తొడగొట్టే విద్రోహశక్తులను హెచ్చరిస్తూ," మేం ఎప్పుడూ మా దేశం జెండాలోని – రంగుల్లాగా కలిసిమెలిసే ఉంటాం – కళ్ళల్లో నిప్పులు పోసుకున్నవాళ్ళే – మమ్మల్ని విడదీసి చూస్తుంటారు" అంటూ అనేకతావాదులకి భారతీయమైన ఏకతా గీతాన్ని"ఓం అల్లా నమస్సలామ్"లో ఆలపిస్తారు. ఈ వర్ణలిపిలో ముప్పై వర్ణాల్లో తెలుగు కవిత్వాన్నీ ఇరవై మూడు వర్ణాల్లో అనువాదకవిత్వాన్నీ వినిపిస్తూ పాఠకులందరినీ తన "ఛప్పన్ భోగ్"విందుకి ఆహ్వానిస్తున్నారు కవి పెరుగు రామకృష్ణ. యుద్ధరహిత సమాజం, ప్రపంచ శాంతి, పర్యావరణం, మానవీయ విలువలు పెరుగు రామకృష్ణ కవితల్లో ఎలా వికాసం పొందుతాయో నాటి గుంటూరు శేషేంద్రశర్మ, చేరా వంటివారి నుండి నేటి రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ముకుంద రామారావు దాకా ఎవరిపద్ధతిలో వారు వివరించడం బాగుంది.



**జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి**






**వర్ణలిపి**
**సంపాదకులు:**
**డా. పెరుగు రామకృష్ణ**
**వెల. 275/- పేజీలు: 129**
**ప్రతులకు:**
**అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు**
**ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై.లి.,**
**సెల్:9705972222, 9849888773**

# ఇదీ రాజకీయ పార్టీలు చేయాల్సిన పని!

తెలంగాణలో శాసనసభకు, ఆంధ్రాలో శాసనసభ, లోకసభకు ఎన్నికలు పరిగెత్తుకు వస్తున్నాయి. తెలంగాణలో 2023, 24లోనూ, ఆంధ్రలో 2024లోనూ జరగవలసి ఉన్న ఎన్నికల సమరాలకు రాజకీయపార్టీలు రెడీ అయిపోతున్నాయి. పాదయాత్రలకు సీను సిద్ధమైపోతోంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడు శైలజానాథ్ కూడా పాదయాత్ర అంటున్నారు. తెలుగుదేశం యువనేత లోకేష్ సరేసరి. ఒక ఏడాది కాలం పాటు ప్రజల్లోనే ఆయన ఉంటారని తెలుగుదేశం వర్గాలు అంటున్నాయి. అధికార పార్టీ అయిన వైసీపీ నుంచి అటువంటి సంకేతాలు ఏమీ ఇప్పటివరకు లేవు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా బస్సుయాత్ర అంటున్నారు. ఎప్పటినుంచి అనేది మాత్రమే తెలియాల్సి ఉంది. ఈ హడావుడి అంతా... రానున్న ఎన్నికల మీద చూపుతోనే అనడంలో సందేహం ఏముంది?

అయితే, వీరంతా పాదయాత్ర... లేదా... బస్సుయాత్ర సందర్భంగా ఏమి చేస్తారు అనే ప్రశ్న ఉదయించడం సహజం. సూర్యోదయం దగ్గర నుంచి సూర్యాస్తమయం వరకు ముఖ్యమంత్రి జగన్ను, వైసీపీ నేతలను విమర్శించుకుంటూ వెడతారా? దానివల్ల, ప్రజాస్వామ్యం పరిపుష్టం అవుతుందా?

ప్రతిపక్షం నాలుగు రాళ్ళు వేస్తే, అధికార పక్షం పది రాళ్ళు వేస్తుంది కదా. ఈ 'కల్చర్' వల్ల, ప్రజాస్వామిక ప్రక్రియ బలోపేతం అవుతుందా? అసలు అధికారపక్షం... ప్రతిపక్షాల మధ్య 'టాకింగ్ టర్మ్స్' లేకుండా పోతే ఎలా?

వీరు... వారూ కలిసి పనిచేయకుండా... 'ప్రజాస్వామ్యం' అనే భావనకు అర్థం ఏమి ఉంటుంది? అధికారపక్షాన్ని ప్రతిపక్షం, ప్రతిపక్షాన్ని అధికార పక్షం దుమ్మెత్తి పోయడమే ప్రజాస్వామ్యమనే భావన... పార్టీలతో పాటు జనంలో కూడా బాగా స్థిరపడిపోయినట్టు కనబడుతోంది.

నిజానికి, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు మూలస్తంభాలు... నేతలు కాదు, రాజకీయ పార్టీలూ కాదు. ప్రజలు, ఓటర్లు. ఓటు ఉన్న వారే ప్రజాస్వామ్య రక్షకులు. చిత్రం ఏమిటంటే.... ఈ విషయం రాజకీయపార్టీలకు తెలుసు కానీ, ఓటర్లకు తెలియడం లేదు.

మన సమాజంలో నిరక్షరాస్యత, 'రూల్ ఆఫ్ లా' పాటించడం పట్ల నిర్లక్ష్య భావన, రాజకీయ అజ్ఞానం, సామాజిక చైతన్య రాహిత్యం, పేదరికం, ఈ పూట గడిస్తే చాలు అనుకునే తాత్కాలిక స్వార్థం, అమాయకత్వం, వీటన్నిటి బైప్రోడక్ట్గా ఏర్పడిన కుల.. వర్గ.. మతతత్త్వ భావనలను రాజకీయశక్తులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయనే స్పృహ ఓటర్లకు లేకుండా పోయింది.

ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి డబ్బు తీసుకోవడం... వీటన్నిటి ఫలితమే. సామాజిక స్పృహ, చైతన్యం ఉన్నవారు ఓటు వేయడానికి డబ్బు తీసుకోరు. మందు, ఇతర ఉచిత బహుమతుల వంటి వాటికి ఆశపడరు.

ఎన్నికలు మన దేశంలోనో... మన రాష్ట్రాలలోనో మాత్రమే జరగడం లేదు. యూకే, అమెరికా, జపాన్, శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, మలేసియాతో సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలలో జరుగుతున్నాయి. ఎక్కడా, ప్రజలు తమ ఓటును డబ్బుకో... ఇతర ప్రలోభాలకో అమ్ముకోరు. పార్టీల విధానాలు, అభ్యర్థుల గుణగణాలు చూస్తారు.

మన దగ్గరే డబ్బు, ప్రలోభాలు, కులం, మతం, వర్గాన్ని సగటు ఓటరు చూస్తున్నాడు.

పూర్వపు ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ఎంఎల్ఏ అభ్యర్థిగా పోటీ చేసిన 2009 ఎన్నికల్లో కూకట్పల్లి నియోజకవర్గంలో చాలామంది ఓటర్లు ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఆయనకు ఓటు వేశారు.

అప్పుడు ఓటు రేటు 500 రూపాయలే. అవతల కాంగ్రెస్ అభ్యర్థి వడ్డేపల్లి నర్సింగరావు. బాదుషా ఆఫ్ కూకట్పల్లి. ఆయన మనుషులు ఇంటింటికీ వెళ్లడం 'మీ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయ'ని అడగడం, టకటకా 500 ఓట్లు లెక్క పెట్టడంగా ఆయన ఎన్నికల ప్రచారం సాగింది.

'సారీ అండి. ఏమీ అనుకోవద్దు. డబ్బులు వద్దు. మేము జయప్రకాశ్ గారికి వేస్తున్నాం...' అంటూ పలువురు ఓటర్లు కాంగ్రెస్ మనుషుల మొహాల మీదే చెప్పేశారు. ఆ ఎన్నికల్లో జయప్రకాశ్ నారాయణ గెలిచి చరిత్ర సృష్టించారు.

అంటే.. ఓటింగ్లో డబ్బు ప్రమేయం లేకపోతే... డబ్బును ఓటర్లు ఆశించకపోతే.. ఒక స్థాయి గలిగిన వారు, శాసనసభను మన పెద్దలు ఎందుకు ఏర్పాటు చేశారో అవగాహన చేసుకోగలిగిన వారు చట్టసభలలో అడుగు పెట్టగలుగుతారనడానికి ఇదో ఉదాహరణగా రాజకీయ పార్టీలు తీసుకోవచ్చు.

ఓటర్లు డబ్బు ఆశించడమే కాదు. డిమాండ్ కూడా చేస్తున్నారు. తెలంగాణలో అయితే హుజూరాబాద్, మునుగోడు వంటి చోట్ల రోడ్డు కూడా ఎక్కారు. వారి డిమాండ్లను దృష్టిలో పెట్టుకునే, ఒక్కో నియోజకవర్గంలో 30 నుంచి 40 కోట్లు ఖర్చు పెట్టుకోగలిగిన అభ్యర్థుల కోసం రాజకీయ పార్టీలు వెదుకుతున్నాయి. ఆ డబ్బు ను ఆ అభ్యర్థులు ఎలా సంపాదిస్తున్నారు అనే విషయం చూడడం లేదు.

'డబ్బు ఉన్నదా? లేదా?' అని ఒకటే ప్రశ్న వేస్తున్నారు.




అందుకే, మోసాలు చేసో... కబ్జాలకు పాల్పడో.... లంచాలు, కమిషన్లు నొక్కేసో... దొంగ సారాయి... గంజాయి అమ్మేసో..., డబ్బు అక్రమంగా సంపాదించడానికి ప్రపంచంలో ఎన్ని వక్రమార్గాలు ఉన్నాయో వాటన్నింటికీ పాల్పడే మైండ్సెట్ బాగా పెరిగిపోయింది. దీనికి తప్పు ఓటర్లదే కానీ... ఆయా రాజకీయవాదులది కాదు.

అందుకే, రాజకీయ పార్టీలు చేయవలసింది.... ఒకదానిపై మరొకటి దుమ్మెత్తి పోసుకోవడం కాదు. ట్వీట్లతో ఎత్తి పొడుచుకోవడాలు కాదు. పౌర సమాజం వినడానికి మనసొప్పని భాషలో తిట్టుకోవడాలు కాదు. తమ కెమెరాలను ప్రత్యర్థి పార్టీల వైపు నుంచి, ప్రజల వైపు తిప్పాలి.

ఓటర్లు... డబ్బుతో సహా ఎటువంటి ప్రలోభాలకూ గురి కాకుండా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవలసిన అవసరాన్ని వారి దృష్టికి బలంగా తీసుకెళ్ళాలి.

ఆంధ్రప్రదేశ్లో ఒక కేస్ స్టడీగా తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటు రేటు ప్రమాదకర స్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయని పలు వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అది నిజమో... కాదో తెలియదు కానీ నిజమైతే మాత్రం.... ప్రజాస్వామ్య ప్రక్రియ.. ఇక, అవసాన దశకు చేరుకున్నట్టే.

ఈ పరిస్థితి నివారణకు..., వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ,సీపీఐ తదితర పార్టీలు ఉమ్మడిగానూ, విడివిడిగానూ కృషి చేయాలి.

డబ్బులు, ఇతర ప్రలోభాలు ఆశించకుండా ఓటింగ్ చేయాల్సిన అవసరం పై ఓటర్లను పెద్దఎత్తున చైతన్య పరచాలి.

ఈ విషయంలో తెలుగుదేశం పార్టీయే చొరవ తీసుకోవాలి. జనసేన, బీజేపీ, సీపీఐ, జై భీమ్ వంటి పార్టీలతో ఒక ఉమ్మడి సమావేశం నిర్వహించి ఓటర్లలో అవగాహనా కార్యక్రమానికి సహకారం అందించవలసిందిగా అధికార పక్షమైన వైసీపీని ఆహ్వానించవచ్చు. ఈ దిశగా నిజాయతీతో కూడిన ప్రయత్నం అయితే ముందు జరగాలిగా!

తెలుగుదేశం యువనేత లోకేష్ రేపోమాపో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 175 నియోజకవర్గాలలోనూ పాదయాత్ర జరుపబోతున్నారు. ఆయన యువకుడు. ఇంకో 35, 40 సంవత్సరాల రాజకీయ జీవితం ఉన్నవారు. ఇప్పుడు చేపట్టబోయే పాదయాత్రను... వైసీపీపై విమర్శలకే అంకితం చేయకుండా... ఓటర్లను చైతన్య పరచడానికి వినియోగించాలి. అటువంటి యువకుడు చెబితే, యువత మీద పెద్ద ప్రభావం ఉంటుంది. లోకేష్ పాదయాత్ర చారిత్రకం అవుతుంది.

రాజకీయ పార్టీలూ అనే కాదు. ఆంధ్రదేశంలో సవాలక్ష సంఘాలున్నాయి. సమాజ హితవు కోరే స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. కుల సంఘాలు ఉన్నాయి. ఊరికో జర్నలిస్టుల సంఘం ఉంది. మత సంఘాలు ఉన్నాయి. ఉద్యోగ సంఘాలు ఉన్నాయి. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగిన ఉపాధ్యాయ సంఘాలు ఉన్నాయి. మేధావుల సంఘాలు ఉన్నాయి. ఇవన్నీ ప్రజల కొరకో, ప్రజల చేతో, ప్రజల మీదో, పడో నడిచే సంఘాలే కదా!

ఈ సంఘాల వారు ఉమ్మడిగా..., కాదనుకుంటే... విడివిడిగా ఓటర్ చైతన్యానికి నడుం బిగించవచ్చు.

ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేయవచ్చు. ఊరేగింపులు చేసుకుంటూ... ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు. గతంలో ప్రజా నాట్యమండలి లాగా వీధి మూలల్లో కళారూపాలు ప్రదర్శించవచ్చు.

జనసామాన్యంపై అసామాన్య ప్రభావం చూపించగలిగిన మెగాస్టార్ చిరంజీవి, చరణ్ తేజ్, అల్లు అరవింద్, అల్లు అర్జున్, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, రాజమౌళి, రాఘవేంద్రరావు, సుకుమార్, దిల్ రాజు వంటి సినీ పెద్దలు... రంగంలోకి దిగి.. ఓటుకు డబ్బులు ఆశించవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేయవచ్చు. కేంద్ర హోంశాఖ పూర్వపు కార్యదర్శి పద్మనాభయ్య, శాంత బయోటెక్నిక్స్ ఛైర్మెన్ వరప్రసాద్రెడ్డి, భారత్ బయోటెక్ అధినేత కృష్ణ ఎల్లా, జయప్రకాశ్ నారాయణ, ఆ స్థాయి కలిగిన మరి కొందరు పెద్దలు ఓటుకు డబ్బు తీసుకోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేయవచ్చు. టీవీ చానెల్స్ ద్వారా వారు తమ వాణిని వినిపించవచ్చు. టీవీ చానళ్ళ యాజమాన్యాల వారు సైతం పెద్దఎత్తున ప్రచారం చేయవచ్చు. ఇదే అంశంపై డిబేట్లు, డిస్కషన్లు, దశ-దిశ వంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

తెలుగులో అగ్రశ్రేణి దినపత్రికలైన ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి.... రోజువారీ స్లోగన్లతో ఓటర్లను చైతన్య పరచవచ్చు. సోషల్ మీడియా చానల్స్ వారు ఈ దిశగా కృషి చేయవచ్చు. అసలు ఈ దిశగా మొదలు అంటూ ప్రారంభమైతే.... ఆకాశమే హద్దుగా 'ఓటర్ చైతన్య' కార్యక్రమాలు నాలుగు పక్కల నుంచి చేపట్టవచ్చు.

రేపటి ఎన్నికలకు కాకపోతే.... ఆ పై ఎన్నికలకు ఈ 'అంటు వ్యాధి' చాలావరకు నివారణ అవుతుంది.

ఒక ప్రయత్నం అనేది ఎక్కడో ఒక చోట మొదలు కాకపోతే తెలంగాణ మొయినాబాద్ ఫార్మ్హౌస్లో దొరికిన రామచంద్ర భారతి, సింహయాజీ, నందు ఇంకా దొరకాల్సి ఉన్న జగ్గస్వామి లాంటి వారికి ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## తండ్రి ఆశయాలను కొనసాగిస్తా



తమ తండ్రి ఆర్వీరాజు ఆశయాలను కొనసాగిస్తానని, విద్య-వైద్యం-ఆధ్యాత్మిక సామాజిక సేవా రంగాల్లో తన వంతు సేవలందిస్తానని ఆయన తనయుడు, ఆర్వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆర్వీఆర్ మోహన్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నెల్లూరు టౌన్హాలులో ఈ ఫౌండేషన్ ప్రారంభకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సత్యనారాయణరాజు, పాబోలు రామసుబ్బయ్య, నరసరాజు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొని మోహన్రాజును అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత చలంచర్ల భాస్కర్రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రముఖ గాయకుడు జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది.

## చేనేతకారులను ఆదుకోవాలి

రాష్ట్రంలో చేనేతకారులు ఆర్థిక సంక్షోభంలో పడి చితికిపోతున్నారని, ప్రభుత్వం వెంటనే నేతన్నలను ఆదుకోవాలని ఆలిండియా హ్యాండ్లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.సుదర్శనచక్రధారి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిఎం జగన్ మోహన్రెడ్డి ఎంతో చొరవతో నేతన్నలకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుచేస్తున్నప్పటికీ ఆచరణలో జరుగుతున్న పొరపాట్ల వల్ల అర్హులైన నిరుపేద నేతకుటుంబాల వారికి కష్టాలే మిగులుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చేనేతకారుల సమస్యలను పరిశీలించి, వారిని కష్టాల నుంచి గట్టెక్కించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## నిరుపేదలకు 'ప్రగతి' సాయం



కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో గూడూరు, బాలాజీనగర్లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ కార్తీకమాసం సందర్భంగా 15 నిరుపేద కుటుంబాలకు 18 రకాల పలసరుకులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, పొణకా మల్లికార్జునరెడ్డి, సురేంద్ర, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు వందనం!

## తన పుట్టినరోజు నాడు తనను కన్న తల్లి స్మృత్యంకంగా... ప్రతిభావంతులకు జన్మనిచ్చిన మాతృమూర్తులను సత్కరించిన 'పద్మభూషణ్' వరప్రసాద్‌రెడ్డి



*'అమ్మ'ంటే.. ఒక పావనగంగా ప్రవాహం లాంటిది. అమ్మ ప్రేమలో ఎలాంటి కపటం ఉండదు. ఏ కల్మషం అమ్మకు అంటదు. రక్తం పంచి, బిడ్డలకు జన్మనిచ్చి ఈ లోకంలోకి తెచ్చి, సన్మార్గులుగా తీర్చిదిద్దే మాతృమూర్తుల కంటే గొప్పవారు ఈ ప్రపంచంలో ఇంకెవరుంటారు?.. అందుకు ప్రతిఫలంగా.. ఏమిచ్చి మనం అమ్మ రుణం తీర్చుకోగలం?.. 'అమ్మా' అని నోరారా పిలుస్తూ.. ఓ పాదనమస్కారం చేసుకుంటే చాలు.. అమ్మ మనసంతా పులకించిపోతుంది. ఆ బిడ్డ జన్మ కూడా తరించిపోతుంది. అందుకే అమ్మను స్మరించుకుంటూ, పుట్టినందుకు జన్మను సార్థకం చేసుకుంటూ, అమ్మ పట్ల అందరికీ మరింత ప్రేమానురాగాలు కలిగేలా స్ఫూర్తినిస్తున్నారు.. శాంతా బయో టెక్నిక్స్ అధినేత, ప్రత్యేకించి మన నెల్లూరీయులు, పద్మభూషణ్ డా.కె.ఐ.వర ప్రసాద్‌రెడ్డి. ప్రతిఏటా ఒక ఆనవాయితీగా ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.*

జన్మనిచ్చిన తల్లికి.. కృతజ్ఞతాపూర్వకంగా వందనం చేసుకోవడం ఒక గొప్ప హృదయ సంస్కారం. ఏ బిడ్డకైనా ఆ సంస్కారం లభించడం ఒక వరం. అలాంటి సత్కార్యాన్ని ఏటా కన్నులపండువగా ఆయన నిర్వహిస్తుండడం విశేషం! ఈ ఏడాది తన 75వ పుట్టినరోజు సందర్భంగా.. నవంబరు 17న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తమ నివాసంలో వరప్రసాద్‌రెడ్డి ఈ విశిష్టమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా, బిడ్డలకు జన్మనిచ్చి.. పెంచి, పెద్దచేసి లబ్ధప్రతిష్టులుగా తీర్చిదిద్దిన పలువురు మాతృమూర్తులను గౌరవించి.. వారికి శిరసు వంచి నమస్కరించే 'మాతృవందనం' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంటోంది. తల్లితండ్రుల పట్ల ఎనలేని ప్రేమాభిమానాలు కలిగిన వరప్రసాద్‌రెడ్డి, తనకు జన్మనిచ్చిన తల్లి స్వర్గీయ కోడూరు శాంతమ్మ స్మృత్యంకంగా నిర్వహించిన ఆ కార్యక్రమం చూస్తేచాలు.. ఎవరికైనా సరే, గుండెనిండా అమ్మ నిండిపోతుంది. అమ్మ అనుభూతులతో మనసంతా పరవశించిపోతుంది.

### వెంకయ్యనాయుడు చేతుల మీదుగా తల్లులకు.. గౌరవ సన్మానాలు

ఈసారి 'మాతృవందనం'లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యాశంకరభారతీ స్వామివారి మాతృమూర్తి విజయలక్ష్మి, సిబిఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ (జేడీ) లక్ష్మీనారాయణ కన్నతల్లి వసుంధర, ప్రముఖ సంగీత దర్శకులు..గురువులు రామాచారి వారి అమ్మ యశోదలకు.. ఎంతో పూజ్యభావంతో గౌరవసత్కారాలు జరిగాయి. తానెక్కడికి వెళ్లినా, మాతృమూర్తిని, మాతృదేశాన్ని, మాతృభాషను ఎప్పటికీ మరచిపోకూడదని పదేపదే చెప్పే భరతమాత ముద్దుబిడ్డ.. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పాల్గొని, బిడ్డలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన ఆ తల్లులకు వందనం చేసి, ఘనంగా సన్మానించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అమ్మ జ్ఞాపకాల సవ్వడిగా సాగి.. ఆకట్టుకుంది. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రికి ఈ సందర్భంగా 'మాతృవందనం' పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. నవ్వులరేడు, సినీనటుడు బ్రహ్మానందం, సంగీతదర్శకుడు మాధవపెద్ది సురేష్, ప్రముఖ గాయని శోభారాజ్, ఎల్‌వి సుబ్రహ్మణ్యం దంపతులు, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. వరప్రసాద్‌రెడ్డి–వసంత దంపతుల పర్యవేక్షణలో, సుప్రసిద్ధ వ్యాఖ్యాత (ఆకాశవాణి) మడిపల్లి దక్షిణామూర్తి వాఖ్యానాలతో కార్యక్రమం ఆద్యంతం అలరించింది.



## శ్రేయోభిలాషి ఇంట స్నేహాభిలాషి

**తనకు అత్యంత సన్నిహితుడైన దివంగత మిత్రుడు నారపరెడ్డి కోదండరామిరెడ్డి కుమారుడు, ప్రముఖ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డి ఇంటికి భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గతం వారం వెళ్ళారు. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని డాక్టర్ విష్ణు ఇంట్లో ఆయన ఒక పూటంతా గడిపారు. కోదండరామిరెడ్డి తనకు మంచి శ్రేయోభిలాషని, తన చిన్నతనంలో చాలా విషయాల్లో కోదండరామిరెడ్డిని చూసి స్ఫూర్తిపొందానని వెంకయ్య పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కోదండరామిరెడ్డి మంచి విద్యావేత్తే కాకుండా, తన వేష భాషలలో కూడా ప్రత్యేకత కనపరిచేవాడని అన్నారు. నారపరెడ్డి సోదరులు విష్ణు, వినోద్‌లతో వారి తండ్రితో తనకున్న గతస్మృతులను పంచుకుని, వారి కుటుంబసభ్యులతో కాలక్షేపం చేశారు.**


శ్రద్ధాంజలి

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజలు మరువరు మీ సేవలు



కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

27వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2022 గురువారం ఉ॥ 10.30 గం॥లకు రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపంలో
మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com